Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 188 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 జూలై 2024 మంగళవారం పేజీలు : 4

## బెయిల్ పిటిషన్లలో జడ్జిలకు కామన్ సెన్స్ అవసరం

బెంగళూరు : బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయమూర్తులకు కామన్ సెన్స్ అవసరమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. కొన్ని ముఖ్యమైన కేసుల్లో ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వారు బెయిల్ మంజూరు చేయకుండా సేఫ్‌గా తప్పుకోవడానికే ఇష్టపడుతున్నారని వ్యాఖ్యానించారు. అయితే ప్రతి కేసునూ నిస్సందేహంగా పరిశీలించడానికి ధృఢమైన ఇంగిత జ్ఞానం కావాలని పేర్కొన్నారు. బెంగళూరు లా యూనివర్సిటీ ఆధ్వర్యం లో 'కంపారిటివ్ ఈక్వాలిటీ అండ్ యాంటీ డిస్క్రిమినేషన్' అనే అంశంపై జరిగిన సదస్సులో న్యాయవాదులు, విద్యార్థులను ఉద్దేశించి చీఫ్ జస్టిస్ ప్రసంగించారు.

# రైతులకు గుడ్‌న్యూస్!

## నేడు రెండో విడుత రుణమాఫీ నిధులు విడుదల!



హైదరాబాద్ : రెండో విడత రైతు రుణమాఫీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేస్తామన్న హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పుడు రెండో విడత రైతు రుణమాఫీకు సిద్ధమైంది. ఈ నెలాఖరులో రెండో విడత, వచ్చే నెల మొదటి వారంలో మూడో విడత నిధులు విడుదల చేస్తామన్న ప్రకారమే రేపు నిధులు విడుదల చేస్తుంది సర్కార్. రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేసే విషయమై ఆర్థిక శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. రేపు రైతు రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. లక్షన్నర లోపు రుణం ఉన్న రైతుల ఖాతాలోకి రేపు నిధులు పడుతాయని వెల్లడించింది. అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. రేపు సభలో రుణమాఫీ పై తెలంగాణ సర్కార్ చర్చ పెట్టే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రేపు కూడా సభలో 19 శాఖల పద్దులపై చర్చ నేపథ్యంలో ప్రకటన ఐనా చేయాలని సర్కార్ భావిస్తుంది. కాగా.. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు మాఫీ చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా కొంత మంది రైతుల ఖాతాల్లో నగదు పూర్తిగా జమ కావడం లేదని ఫిర్యాదులు అందుతుండటంతో దీనిపై మంత్రి తుమ్మల స్పందించిన విషయం తెలిసిందే. రెండో విడత రుణమాఫీలో భాగంగా రైతుల ఖాతాల్లో రూ.1.50 లక్షల వరకు జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా కొంత మంది రైతుల ఖాతాల్లో నగదు పూర్తిగా జమ కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని దీనిపై మంత్రి తుమ్మల వివరణ ఇచ్చారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణాలు ఉన్న రైతులకు మాఫీ అవుతుందని భావించగా కొంత మంది రైతుల ఖాతాల్లో సాంకేతిక సమస్యల వల్ల అది సాధ్యం కాలేదు. రుణమాఫీ సొమ్మును రిజర్వ్ బ్యాంకు ఈ-కుబేర్ విధానంలో జమ చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 17 వేల 877 మంది లబ్ధిదారుల ఖాతాల్లో 84.94 కోట్ల రూపాయలు జమ కాలేదన్నారు. ఆ నిధులు ఆర్‌బీఐ వద్దే ఉన్నాయని తెలిపారు.



## జీఎస్టీ స్కామ్‌పై అసెంబ్లీలో చర్చ.. అరెస్టులు ఖాయమా?

హైదరాబాద్, జూలై 29: కమర్షియల్ ట్యాక్స్ స్కామ్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. రూ.1400 కోట్ల స్కామ్‌పై అసెం బ్లీలో చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కుంభకోణంలో ఇప్పటికే ఐదు మందిపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ వ్యవహారంపై సీసీఎస్ పోలీసులు ఇప్పటికే ఆధారాలను సేకరించారు. 75 మంది పన్నులు చెల్లింపుదారులు కార్యకలాపాల వివరాలను నిందితులు ఉద్దేశపూర్వకంగా ఆన్‌లైన్‌లో కనిపించకుండా చేసినట్లు తెలుస్తోంది. పన్ను ఎగవేతకు నిందితులు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. కమర్షియల్ ట్యాక్స్ , ఐఐటీ హైదరాబాద్ మధ్య జరిగే లావాదేవీలను కూడా పక్కదారి పట్టినట్లు గుర్తించారు. హైదరాబాద్ ఐఐటీ సాఫ్ట్‌వేర్‌లోని సమాచారాన్ని స్పెషల్ ఇనిషియేటివ్ వాట్సప్ గ్రూప్‌కు చేరేలా ఆదేశాలు జారీ అయ్యాయని.. ఆ గ్రూప్‌లో మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ కూడా ఉన్నట్లు గుర్తించారు. తెలంగాణా బేవరెజస్ కార్పొరేషన్ పన్ను ఎగవేత ద్వారా కమర్షియల్ ట్యాక్స్‌కు వేయి కోట్లు నష్టం వాటిన్నట్లు సమాచారం. మరో 11 ప్రైవేటు సంస్థలు రూ.400 కోట్ల వరకు పన్నులు ఎగవేసినట్లు గుర్తించారు. ఈ కేసులో మరికొంత మందికి సీసీఎస్ పోలీసులు నోటీసులు ఇవ్వనున్నారు. అసెంబ్లీలో చర్చ తర్వాత అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కమర్షియల్ ట్యాక్స్ స్కామ్‌పై సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ -5 నిందితుడిగా సోమేశ్ కుమార్ పేరు చేర్చారు.




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఐదవ రోజు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశోత్తారాలపై చర్చను సభాపతి రద్దు చేశారు. ఆర్థిక నిర్వహణ , ఆర్థిక ప్రణాళిక, విద్యుత్ డిమాండ్స్‌పై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై సభలో వాడి వేడిగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగింది. వ్యక్తిగత దూషణలతో ఒక్కసారిగా అసెంబ్లీ వేడెక్కింది. నల్లగొండలో జగదీశ్‌రెడ్డికి క్రిమినల్ రికార్డు ఉందని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. దీంతో మంత్రి ఆరోపణలపై సవాల్‌కు సిద్ధమని జగదీశ్‌రెడ్డి అన్నారు. తాను కూడా ఛాలెంజ్‌కి సిద్ధమేనంటూ మంత్రి సవాల్ చేశారు. హత్యకేసులో జగదీశ్‌రెడ్డి 16 ఏళ్లు కోర్టు చుట్టూ తిరిగారని, నిరూపించలేకపోతే తన మంత్రి

## మంత్రి కోమటి రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి..

పదవికి రాజీనామా చేస్తానని కోమటిరెడ్డి అన్నారు. జగదీష్‌రెడ్డిపై మర్డర్ కేసులున్నాయని, ఆయన తండ్రి మీద అనేక కేసులున్నాయని, ఎన్టీఆర్ సీఎంగా ఉన్న టైంలో ఎక్సైజ్ కేసులు కూడా ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్రోల్ బంక్‌లో దొంగతనం కేసులో ఆయన నిందితుడని, జగదీశ్‌రెడ్డిని ఏడాది పాటు జిల్లా నుంచి బహిష్కరించారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై మూడు హత్య కేసులు పెట్టారని.. ఆ మూడు కేసుల్లో న్యాయస్థానం నిర్దోషిగా తేల్చిందన్నారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం సమయంలో తనపై కేసులు ఉన్నాయని.. అవి తప్ప ఇంకా ఏమైనా కేసులు తనపై ఉంటే హౌస్ కమిటీ వేయాలని సభాపతిని కోరారు. నిరూపిస్తే అసెంబ్లీతో తన సీటు నుంచి స్పీకర్ చైర్ వరకు ముక్కు నేలకు రాసి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపించలేని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి తమ పదవులకు రాజీనామా చేయాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకుని వివిధ సబ్జెక్టులపై చర్చ వస్తే దానిపై కూడా మాట్లాడతామని, కానీ ఇప్పుడు ప్రభుత్వ పరంగా ఉన్న డిమాండ్‌కు సంబంధించి చర్చ జరుగుతోందని దానిపైనే సభ్యులు మాట్లాడాలని ఆయన సూచించారు. పవర్‌కు సంబంధించి చర్చ జరుగుతోందని దానిపై చర్చ జరగాలని మంత్రి శ్రీదర్ బాబు మరొక్కసారి సభ్యులకు సూచించారు.



# పూర్వవైభవం దిశగా...

# టీటీడిపిపై చంద్రబాబు ఫుల్ ఫోకస్

## అరవింద్ కుమార్ గౌడ్ కు కీలక బాధ్యతలు!

హైదరాబాద్ : తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతం పై చంద్రబాబు ఫోకస్ పెట్టారా? కీలక నేతకు బాధ్యతలు అప్పగించనున్నారా? పార్టీలో చేరికలను ప్రోత్సహించనున్నారా? బిఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున నేతలు రానున్నారా? ముఖ్యంగా కమ్మ సామాజిక వర్గం తిరిగి టిడిపి గూటికి చేరనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అసలు పార్టీ బలపడుతుందా? లేదా? అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ చంద్రబాబు నాయకత్వంలో టిడిపి మరోసారి అధికారంలోకి వచ్చింది.దీంతో తెలంగాణలో కూడా టిడిపి పుంజుకుంటుందన్న ఆశ వచ్చింది. ముఖ్యంగా గ్రేటర్లో టిడిపి పుంజుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకే చంద్రబాబు టీటీడీపీ అధ్యక్ష పదవిని భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. తొలుత నందమూరి కుటుంబ సభ్యులకు తెలంగాణ పార్టీ బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరిగింది. హరికృష్ణ కుమార్తె సుహాసిని కి అధ్యక్ష పదవి ఇస్తారని టాక్ నడిచింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీసీ వర్గాలకే అప్పగించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ప్రధానంగా అరవింద్ కుమార్ గౌడ్ పేరు వినిపిస్తోంది. కాసాని జ్ఞానేశ్వర్ టీటీడీపీ అధ్యక్షుడిగా ఉండగా.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన రాజీనామా చేశారు. అప్పటినుంచి పదవి ఖాళీగా ఉంది. ఇప్పుడు దానిని భర్తీ చేయడానికి చంద్రబాబు సిద్ధమయ్యారు. ముందుగా అధ్యక్ష పదవిని భర్తీ చేసి.. టిడిపి కార్యకలాపాలు పెంచాలని.. అప్పుడే ఇతర పార్టీల నుంచి చేరికలు ఉంటాయని చంద్రబాబు భావిస్తున్నారు.

**కెసిఆర్ పార్టీ నిర్వీర్యం :** తెలంగాణలో కెసిఆర్ పార్టీ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. 2014లో తెలంగాణలో తొలిసారిగాఅధికారంలోకి వచ్చారు కెసిఆర్. అప్పటివరకు ఉద్యమ తెలంగాణపై దృష్టి పెట్టిన ఆయన.. బంగారు తెలంగాణ అంటూ హడావిడి చేయడం ప్రారంభించారు.

టిఆర్ఎస్ లో పాలనపై అనుభవమున్న నేతలు తక్కువగా ఉండడంతో.. టిడిపి నుంచి చేరికలకు ప్రోత్సహించారు. కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, గంగుల కమలాకర్, నామా నాగేశ్వరరావు, మల్లారెడ్డి ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు.. నేతలంతా క్యూ కట్టారు టిఆర్ఎస్లోకి. వారంతా టిడిపిలో పదవులు అనుభవించిన వారే.

**టిడిపిలోనే కొనసాగుతున్న కొంతమంది నేతలు :** అయితే చాలామంది టిడిపిలోనే కొనసాగుతున్నారు. పార్టీ అంటే అభిమానం, చంద్రబాబు అంటే గౌరవంతో ఇప్పటికీ నేతలు కొనసాగుతున్నారు. రావుల చంద్రశేఖర్ రెడ్డి, అరవింద్ కుమార్ గౌడ్, నన్నూరి నర్సిరెడ్డి, బక్కని నరసింహులు, కాట్రగడ్డ ప్రసూన, నందమూరి సుహాసిని వంటి నేతలు ఇప్పటికీ యాక్టివ్ గా ఉన్నారు. ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. టీటీడీ పాలకమండలి సభ్యులుగా కొంతమంది తెలంగాణ నేతలకు చంద్రబాబు ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. మరికొందరికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది.

**బీసీ నేతకు అవకాశం :** ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో తెలంగాణ టిడిపికి అధ్యక్ష పదవి భర్తీ చేస్తారని తెలుస్తోంది. నందమూరి సుహాసిని కి ఆ బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరిగినా.. బీసీ నేత అయితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అయ్యింది. ఈ తరుణంలోనే అరవింద్ కుమార్ గౌడ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఈయన తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగిన దేవేందర్ గౌడ్ కు స్వయాన మేనల్లుడు. ఈయన ఏ పార్టీలో చేరకుండా టిడిపిలోనే కొనసాగుతూ వచ్చారు. అందుకే ఆయనకి ఇస్తే సముచితం అని చంద్రబాబు భావిస్తున్నారు. ఇటీవల అమరావతి వచ్చిన అరవింద్ చంద్రబాబును కలిశారు. చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

# సంపాదకీయం

## ఇప్పుడు బాధపడి లాభం ఏంటి జగనన్న..?

అధికారంలో ఉన్నప్పుడే మీడియా ముందుకు వచ్చి వాస్తవాలను ప్రజలకు వివరించి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి అయితే వచ్చి ఉండేది కాదు కదా! ఇదీ.. ఇప్పుడు వైసీపీ అధినేత జగన్ గురించి వినిపిస్తున్న టాక్. కానీ అధికారంలో ఉన్నప్పుడు ఒక సారి కూడా మీడియా ముందుకు రాకుండా ఏం జరుగుతుందో కూడా తెలుసుకోకుండా వ్యవహరించి మైనస్ అయ్యారు. పైగా అప్పుల విషయంలోనూ ఆర్థిక వ్యవస్థ విషయం లోనూ శాంతిభద్రతల విషయంలోనూ ఇసుక మైనింగ్ ఇతర అంశాల్లోనూ తీవ్ర స్థాయిలో వచ్చిన ఆరోపణలు, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసిన దాడి, అదే సమయంలో ఓ వర్గం మీడియా ప్రచురించిన అనేక విషయాలను ప్రజలు గమనించారు. దీనిని తప్పుపట్టాల్సిన అవసరం. అధికార పార్టీని టార్గెట్ చేయడం అధికార పార్టీ తప్పులను ఎత్తిచూప టం అధికార పార్టీని సాధ్యమైనంత వరకు ప్రజలకు దూరం చేయటం అనే కాన్సెప్ట్ తో ప్రతిపక్షం ముం దుకు సాగుతుంది. రేపు వైసిపి అయినా ఇదే పని చేస్తుంది. కాబట్టి దీనిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే ఏదైనా జరిగినప్పుడు వెంటనే కౌంటర్ ఇవ్వటం అనేది అధికార పక్షానికి ఉన్న అవస రం. గతంలో చంద్రబాబు కూడా గోదావరి పుష్కరాల సమయంలో జరిగిన ఘటనకు వెంటనే కౌంటర్ ఇచ్చారు. అప్పట్లో 37 మంది చనిపోయారని, చంద్రబాబు షూటింగ్ కారణంగానే ఇలా జరిగిందని వైసీపీ నాయకులు విమర్శలు చేశారు. ఆ సమయంలో టిడిపి నాయకులు వెంటనే స్పందించారు. అలాగే విజయవాడలో నకిలీ మద్యం తాగి ఏడుగురు రిక్షా కార్మికులు చనిపోయినప్పుడు కూడా పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఆ వెంటనే చంద్రబాబు స్పందించారు. ఈ విషయంలో ఎక్కడా ఆయన రోజుల తరబడి సమయం తీసుకోలేదు. రెండు మూడు గంటల్లోనే స్పందించి ఆ విషయాలపై క్లారిటీ ఇచ్చారు. అలాంటి పరిణామం వైసీపీలో ఎక్కడా కనిపించలేదు. ముఖ్యంగా అంతర్వేది రథం దగ్ధమైనప్పుడు జగన్ స్పందిస్తారని ఆశించారు. విజయనగరం జిల్లాలో రాముడి తల తీసేశారన్న విషయం.. వెలుగు చూసినప్పుడు ప్రభుత్వం స్పంది స్తుందని, ముఖ్యమంత్రి జగన్ బయటకి వస్తారని ఎదురు చూశారు. అప్పుడు కూడా రాలేదు. ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారంలో మరింతగా వైసిపి డ్యామేజ్ అయింది. ఎంపీ గోరంట్ల మాధవ్ విషయంలోనూ అలాగే డాక్టర్ సుధాకర్ విషయంలోనూ.. అదే విధంగా తాడేపల్లిలో జరిగిన ఒక యువతి దారుణం విషయంలోనూ జగన్మోహన్ రెడ్డి స్పందిస్తారని, దానికి వివరణ ఇస్తారని వైసీపీ నాయకులే కాదు వైసిపి సానుభూతిపరులు కూడా ఎదురు చూశారు. కానీ ఏ రోజు ఏ విషయం పైన జగన్ మైకు పట్టుకున్నది లేదు. వివరణ ఇచ్చింది లేదు. దీంతో ప్రతిపక్షాలు చెప్పిందే నిజమని ప్రజలు అనుకున్నారు. ఎందుకంటే సాధారణంగా ఒక వ్యక్తిని ఎవరైనా దొంగ అంటే వెంటనే రియాక్ట్ అవుతాడు. నేను దొంగతనం చేయలేదు, నాకు సంబంధం లేదు అని తనంత తాను డిఫెన్స్ చేసుకునేందుకు ప్రయత్నిస్తాడు. అలాంటిది ఐదు కోట్ల మంది ప్రజలకు నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వం తనపై ఇన్ని ఆరోపణలు వచ్చినా స్పందించకపోవడం కనీసం ఏ ఒక్కరోజు మీడియా ముందుకు రాకపోవడం. వచ్చినా సరైన వివరణ, సరైన వాయిస్ వినిపించలేని కారణంతో విపక్షాల మాటే చెల్లుబాటయింది. ఇప్పుడు ఎన్ని చెప్పుకున్నా ఎన్ని చేసినా చివరకు చంద్రబాబు ప్రవేశపెట్టిన శ్వేత పత్రాల ద్వారా జగన్మోహన్ రెడ్డి పాలల్లో భారీ స్థాయిలో అప్పులు జరగలేదని స్పష్టమైన మద్యం వినియోగం తగ్గించి మేలు చేశారు అని మేధావులు సైతం భావిస్తున్నా ఇప్పుడైతే చేతులు కాలిపోయాయి. ఇప్పుడైతే అధికారం రాదు కదా ఇప్పుడైతే ప్రధాన ప్రతిపక్ష హెూదా కూడా దక్కుతుందో లేదో తెలియదు కదా. కాబట్టి ఏదైనా ప్రజలకు పార్టీ అధినేతకు మధ్య ఉండాల్సిన బలమైన బంధాన్ని, మీడియాకు పార్టీ అధినేతకు మధ్య ఉండాల్సిన ఒక సానుకూల దృక్పథాన్ని.. జగన్ పాటించని కారణంగా ప్రతిపక్షాల ప్రచారమే నిజమని ప్రజలు నమ్మకోవడంలో తప్పేమీ లేదు. ఇప్పటికైనా వాస్తవాన్ని గ్రహించి కనీస వారానికి రెండుసార్లు నెలకి మూడుసార్లు అయినా మీడియా ముందుకు వచ్చి ఏం జరిగింది ఏం జరుగుతోంది ఏం జరగాలి అని ఈ మూడు విషయాలపై జగన్మోహన్ రెడ్డి వివరణ ఇస్తే ప్రజలకు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంటుంది. అలా కాకుండా నా పద్ధతి నాదే నేను బయటికి రాను సజ్జల రామకృష్ణారెడ్డి అనే వ్యక్తులు మాత్రమే మీడియా ముందుకు వస్తారు అంటే జరిగే నష్టం ఏమిటో ఈ ఎన్నికలు చెప్పేశాయి. మునుముందు జాగ్రత్త పడాలంటే ఇప్పటికే నా జగన్ కళ్ళు తెరవాలి.

# రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం

### సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్




శామీర్ పేట, (గరుడ వార్త ) తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలుపరచడంలో ప్రధాని నరేంద్ర మోడీ పూర్తిగా విఫలమయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్. బాల మల్లేష్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రం శామీర్ పేటలో డీజీ నరేందర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలాల సిపిఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ఎన్ బాల మల్లేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీలను నరేంద్ర మోడీ ఉదాసీనంగా వ్యవహరించారని పేర్కొన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక నిధులు కేటాయింపు, ప్రభుత్వ సంస్థల ఆస్తుల పంపిణీ ఇలాంటి ఏ ఒక్క హామీని అమలు పరచ లేదని ఘాటుగా విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వడం, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. నూతనంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు 6 గ్యారంటీలు ఇచ్చిందని తెలిపారు. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.మేడ్చల్ మల్కాజ్గిరి సిపిఐ జిల్లా కార్యదర్శి డి.జి. సాయిలు గౌడ్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రైతాంగ సమస్యల ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే పేదలకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని, శామీర్ పేట మండలంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సి. హెచ్. దశరథ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల నరసింహ, అల్వాల్ మండల సిపిఐ సహాయ కార్యదర్శి పి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**శామీర్ పేట మండల సిపిఐ కార్యదర్శిగా డీ.జీ.నరేంద్ర ప్రసాద్ ఎన్నిక....**
శామీర్ పేట మండల సిపిఐ కార్యదర్శిగా డీ.జీ.నరేందర్ ప్రసాద్ మండల సిపిఐ సహాయ కార్యదర్శులుగా ఎం. అనిత, ఓంకార్, మురళీ ధర్ రాజు లతోపాటు, 13 మందితో నూతన కౌన్సిల్ ను ఎన్నుకున్నారు.

**మూడు చింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శిగా టి. రాములు గౌడ్ ఎన్నిక....**అలాగే మూడు చింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శిగా టి రాములు గౌడ్ ను ఎన్నుకున్నారు.వీరితోపాటు 11 మందితో నూతన కౌన్సిల్ ను ఎన్నుకున్నారు.

## కారు చెట్టుకు ఢీకొనడంతో ఒకరు మృతి

శామీర్ పేట, (గరుడ వార్త) : కారు చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన జీనం వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్ సి పురంకు చెందిన రాజేశ్వర్ రావు(64) తన కుటుంబసభ్యులతో కలిసి కొమరవెల్లి దేవాలయానికి వెళ్ళి తిరిగి వస్తుండగా సోమవారం ఉదయం శామీర్ పేట మండలం తుర్కపల్లి పరిధిలోని అచాయిపల్లి చెక్ పోస్ట్ సమీపంలో సాంట్రో కార్ బేరింగ్ నెంబర్ టీ ఎస్ 15 ఈ యు 8631 కారు వేగంగా వస్తువు అదుపుతప్పి రోడ్డు కు ఎడమ వైపున చెట్టును ఢి కొట్టింది. దీంతో కార్ నడుపుతున్న రాజేశ్వర్ రావు తో పాటు అతని భార్య విజయ లక్ష్మి, కొడుకు ప్రవీణ్, కూతురు ప్రవలిక, అల్లుడు ప్రవీణ్ కు తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఓజోన్ ఆస్పత్రికి తరలించారు. కాగా కారు నడిపిన



రాజేశ్వరరావు ఆసుపత్రికి తరలించేసరికి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు జీనం వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రయమంటూ దూసుకెళ్తూ.. దడ పుట్టిస్తూ



హైదరాబాద్: సాయంత్రం దాటితే చాలు.. రేస్ ట్రాకుల్లా మారుతున్న నగర రోడ్లపై ప్రయాణం వెన్నులో వణుకుపుట్టిస్తోంది. ఖరీదైన కార్లు, బైకులతో దూసుకెళ్లడం.. ఒళ్లు తెలియనంతలా తప్పతాగి బండి నడపడం వెరసి ఎప్పుడు ఏవైపు నుంచి ఏ వాహనం ఢీకొడుతుం దో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా మందుబాబుల డ్రైవింగ్ వాహనదారులు, పాదచారుల ప్రాణాల మీదకొస్తోంది. పోలీసు లు డ్రంకెన్ డ్రైవ్‌లతో నిలువరిస్తున్నా కొందరు మాత్రం అడ్డదారుల్లో రహదారుల మీదకు దూసుకొస్తున్నారు. ఇటీవల రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐటీ ఉద్యోగి రహదారిపై బీభత్సం సృష్టించారు. గంట వ్యవధిలో ఆరు రోడ్డు ప్రమాదాలు చేశాడు. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నా నియంత్రించడం సాధ్యపడడం లేదు.

వారాంతాల్లో అమ్మో.. ఖాళీ రోడ్లపై ఆకతాయిలు, పోకిరీలు స్టంట్లుచేస్తూ ప్రమాదాలకు కారణమవుతుంటే.. వారాంతాల్లో మరింత దారుణ పరిస్థితులు ఎదురవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో లైకుల కోసం రేసింగ్‌లు, వేగంగా దూసుకెళ్తూ అవతలి వ్యక్తుల్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఐటీ కారిడార్, నగరంలోని ఖాళీ రోడ్లపై ఈ తరహా పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఖరీదైన కార్లు, ద్విచక్రవాహనాలపై రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాకే పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. నిందితుల్ని పట్టుకున్నా.. నిర్లక్ష్యపు డ్రైవింగ్ కింద కేసు నమోదుకే పరిమితమవుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలున్నా..

పోలీసులు వారాంతాల్లో తప్పనిసరిగా, మిగిలిన రోజుల్లో హఠాత్తుగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఇవీ నిర్ణీత సమయం వరకే ఉండటంతో తరువాత మందుబాబులు చెలరేగుతున్నారు. అర్ధరాత్రి తర్వాత రోడ్డు ప్రమాదాలకు ఇదీ ఓ కారణం. కొందరు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి ఎక్కడెక్కడ తనిఖీలున్నాయో సమాచారం ఇచ్చుకుంటున్నారని చెబుతున్నారు.

పబ్బుల దగ్గర లేని నియంత్రణ..

పబ్బులు, బార్లలో ఎవరైనా మద్యం అతిగా సేవిస్తే వారు వాహనాలు డ్రైవింగ్ చేయకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యామ్నాయ డ్రైవరు వచ్చేదాకా వారిని నిలువరించడం లేదా క్యాబ్‌లో పంపాలి. ఇటీవల కొత్తఏడాది వేడుకల సందర్భంగానూ పోలీసులు పబ్బులు, బార్ల నిర్వాహకులకు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇదెక్కడా అమలవ్వడం లేదు. రాయదుర్గం రోడ్డు ప్రమాదంలో ఇదే పరిస్థితి. నిందితుడు ఆరు ప్రమాదాలకు కారణమైన యువకుడు సాయంత్రం తర్వాత ఓ పబ్బులో తాగాడు. పూర్తిగా నియంత్రణ కోల్పోయిన స్థితిలో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు చేశాడు. దుర్గం చెరువుపై వింత పరిస్థితి దుర్గం చెరువు తీగల వంతెనపై వాహనదారుల తీరుతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించే విధుల్లో ఉంచిన ట్రాఫిక్ పోలీసులకు వింత అనుభవాలు ఎదురవుతున్నాయి. విధుల్లో ఉండే ఇద్దరు కానిస్టేబుళ్లకు బ్రిడ్జి పొడవునా ఫొటోలు దిగే సందర్శకుల్ని నియంత్రించడం సాధ్యపడటం లేదు. ముఖ్యంగా మహిళలు వారించినా వినకుండా అసౌకర్యం కల్పిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇటీవల బ్రిడ్జిపై హిట్ రండ్ అన్ కేసు నేపథ్యంలో మాదాపూర్ పోలీసులు కవాతు నిర్వహిస్తూ అవగాహన కల్పించినా పరిస్థితిలో మార్పురావడం లేదు. అడపాదడపా రోడ్డు మీద వాహనాలు నిలిపి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

## జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో పగులుతున్న అద్దాలు.. అంతుచిక్కని అనుమానాలు

హైదరాబాద్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ల్లో ఆకతాయిలు రెచ్చిపోయారు. వాణిజ్య సముదాయాల అద్దాలను ధ్వంసం చేశారు. ఆయా దుకాణాల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కావాలనే కొందరు రాళ్లతో దాడి చేసి అద్దాలను ధ్వంసం చేస్తున్నారంటూ వారు అనుమానం వ్యక్తం చేశారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ తతంగంపై పోలీసులు ఒకేసారి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. గత నెల 20న రాత్రి 7 గంటల ప్రాంతంలో బంజారా హిల్స్ రోడ్ నంబరు 2లోని బ్రూక్స్ బ్రదర్ స్టోర్ అద్దాలు ఒక్కసారిగా పగిలిపోయాయి. ఆ తర్వాత గంట వ్యవధిలో స్థానిక వాన్ హుస్సేన్ స్టోర్ అద్దాలు, ఆ పక్కనే ఉన్న వైట్ క్రో స్టోర్ అద్దాలు, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ 24 సెవన్ గ్రాసరీ స్టోర్‌కు సంబంధించిన అద్దాలు పగిలిపోయి గాజు



ముక్కలు దుకాణాల్లో చిందరవందరగా పడిపోయాయి. దీంతో కొనుగోలుదారులు భయాందోళనకు గురయ్యారు. ఓ వ్యక్తికి స్వల్పంగా గాయమైంది. మరుసటి రోజు రాత్రి రోడ్‌నంబరు 2లోని ఆర్‌కే సినీప్లెక్స్(పీవీఆర్ మాల్)లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ఆ తర్వాత కూడా ఈ మాల్‌లో రెండుసార్లు ఇదే ఘటన చోటుచేసుకుంది ఈనెల 4న రాత్రి బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని సూర్య సిల్క్ టెక్స్ క్రియేషన్ స్టోర్ అద్దాలు, 5న రాత్రి స్థానిక అండర్ ఆర్మర్ స్టోర్‌లోని భారీ అద్దాలపైకి రాళ్లు దూసుకురావడంతో ముక్కలయ్యాయి. ఇలా పదికిపైగా సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలపై ఆయా స్టోర్ల మేనేజర్లు ఈనెల 16న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటివరకు 8 కేసులు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే ఇద్దరు క్యాబ్ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

# రహదారి నిర్మించారు.. సమస్యలు మరిచారు

వేములవాడ : గుంతల రహదారితో ఇబ్బందులు ఎదురవుతుండటంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో పక్కా రోడ్డు నిర్మాణంతో రవాణా సదుపాయం మెరుగైంది. దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. అయితే అధికారులు మిగులు పనులపై దృష్టిసారించడం లేదు. పైగా రహదారి నిర్మాణ సమయంలో ఏర్పడిన సమస్యను పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.వేములవాడ– కోరుట్ల ప్రధాన రహదారిలోని రుద్రంగి మండల కేంద్రంలో రహదారి అస్తవ్యస్తంగా ఉండేది. గుంతల రహదారి వల్ల వాహనదారులు, స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్లు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం రూ. 12.8 కోట్లు మంజూరు చేయడంతో పక్కా రహదారి నిర్మించారు. దీంతో రవాణా సౌకర్యం మెరుగుపడి సమస్య తీరింది. అయితే మిగులు పనులపై అధికారులు దృష్టిసారించడం లేదు. రహదారిని ఎత్తుగా నిర్మించడం వల్ల పలువురి ఇళ్లు, దుకాణాలు



పూర్తిగా కిందకు అయ్యాయి. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీరు ఇళ్లు, దుకాణాల్లోకి వస్తుంది. రహదారి వెంబడి పక్కన ఉన్న కాలనీల్లోకి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్లను ఎత్తుగా నిర్మించి తారు వేయకపోవడంతో అది కోతకు గురై ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఉన్నప్పటికీ దీపాలు వెలగడం లేదు. పచ్చదనం కోసం, రాత్రి సమయంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాల లైట్లు ఒకదానిపై మరొకటి పడకుండా ఉండేందుకు డివైడర్ మధ్యలో మొక్కలు నాటాల్సి ఉండగా ఆ పనులు కూడా చేపట్టలేదు.

ఇళ్లలోకి నీరు
– పిల్లమారపు ప్రవీణ్, స్థానికుడు

రహదారి నిర్మాణం ఎత్తుగా చేపట్టారు. నిర్మాణ సమయంలో మా అభ్యంతరాలను పట్టించుకోలేదు. రహదారి ఎత్తుగా ఉండటం వల్ల ఇళ్లు, పలువురి దుకాణాలు కిందకు అయ్యాయి. వర్షాకాలంలో వరద లోపలికి చేరుతుంది. సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి
– మంగ శేఖర్, స్థానికుడు

వీధిలో నుంచి ప్రధాన రోడ్డుపైకి వెళ్లే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి ఎత్తుగా ఉండటం, అప్రోచ్ రోడ్డుపైన తారు వేయకపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పలువురు కిందపడుతున్నారు. డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు మొక్కలు నాటాలి.

పరిశీలించి పరిష్కరిస్తాం
– సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ

నిబంధనల మేరకు రహదారి నిర్మాణం చేపట్టాం. స్థానికుల సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువల నిర్మాణం, డివైడర్ మధ్యలో మొక్కలు నాటడం, సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణ త్వరగా పూర్తయ్యే విధంగా చూస్తాం.

# గుండె దడదడనే

హైదరాబాద్ లాంటి మహానగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రూపుదిద్దుకుంది. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగానే వైద్యం అందించాల్సి ఉంది. ఇందులో కార్డియాలజీ విభాగం పాత్ర కీలకం. అందుకే ప్రభుత్వం నాలుగు కార్డియాలజీ పోస్టులను మంజూరు చేసింది. కానీ భర్తీ చేయలేదు. ఫలితంగా గుండెనొప్పితో సూపర్ స్పెషాలిటీకి వచ్చే రోగుల ప్రాణాలకు భరోసా లేకుండా పోతోంది. ఆదిలాబాద్‌లో 2019లో ఉమ్మడి జిల్లా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్)గా పని చేసిన సంజయ్‌కుమార్ గుప్తా గుండెనొప్పితో రిమ్స్‌కు వచ్చినా ప్రాణాలు దక్కలేదు. ఇటీవల మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, అంతకుముందు బ్యాంకు అధికారి ధర్మేందర్, తాజాగా గురువారం సంతోష్(40) గుండెనొప్పితో ప్రైవేటు ఆసుపత్రుల్లో కన్నుమూయడం కార్డియాల జిస్టుల కొరతను చాటి చెబుతోంది. ఇవి మచ్చుకు కొన్ని ఘటనలే. ఒకవేళ రిమ్స్‌లో నిపుణులైన కార్డియాలజిస్టులు ఉంటే ప్రాణాలను రక్షిస్తారనే భరోసా ఉంటుంది.

నిర్లక్ష్యమే – సురేందర్ రిమ్స్‌లో వైద్యులను నియమించకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యమే. ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదు. గతంలో భారాస, ఇప్పుడు కాంగ్రెస్, ప్రభుత్వాలు మారాయే తప్పితే రోగులకు జరిగిన న్యాయమేం లేదు.

నమూనా కోసమే – రూపేష్‌రెడ్డి

రిమ్స్ సహా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నమూనా కోసమే అన్నట్లు ఉంది. సాధారణ వైద్యం, చిన్నపాటి శస్త్ర చికిత్సలు కమ్యూనిటీ ఆసుపత్రుల్లోనూ చేస్తారు. కానీ రూ.వందల కోట్లతో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో వైద్యుల పోస్టులు భర్తీ కాకుంటే ఫలితమేముంటుంది.

కనికరమే లేదు– కిరణ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పేదలంటే కనికరం లేదు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పేర్లు చెప్పడం గొప్ప కాదు. ఆపదలో ఉన్న రోగులకు ప్రాణం పోశారా లేదా అనేది ముఖ్యం. ఎమ్మారై పరీక్షల్లేవు. కార్డియాలజీ పరీక్షలు చేసే వారే లేరు. పేరుకే పెద్దాసుపత్రి.

ప్రభుత్వానికి నివేదించాం– డా.జైసింగ్ డైరెక్టర్

కార్డియాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో, న్యూరోఫిజిషియన్ల పోస్టులు చాలా కీలకమే. అందులో కొరత ఉన్న మాట నిజమే. తాజాగా ఏడుగురు వైద్యులకు బదిలీ జరిగింది. అందుబాటులో ఉన్న వైద్యులతో రోగులకు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం. తప్పనిసరైతే రెఫర్ చేస్తాం. ఖాళీల విషయమై ప్రభుత్వానికి నివేదించాం. ఆసక్తి కలిగిన వైద్యులు ముందుకొస్తే కాంట్రాక్టు పద్ధతిలో వెంటనే భర్తీ చేస్తాం.

# కర్షకుల కష్టం.. వరదార్పణం!

ఆసిఫాబాద్ : జిల్లాలో తెరిపివ్వకుండా వారం రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో.. ఆయా నదుల పరీవాహక ప్రాంతాల రైతుల చేల పంటలన్నీ నీట మునిగాయి. రోజుల తరబడి నీటిలో మునిగి ఉండటంతో నెల రోజుల వయసున్న పత్తి మొక్కల ఆకులు నల్లగా మారి వాడిపోతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో నదులు, వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వీటితో పాటు పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగా నదులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. పరీవాహక ప్రాంతాల పంట చేలన్నీ వరదతో ముంచేశాయి. జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తిని ఏటా వానకాలంలో నదుల వరద తుడిచి పెడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. గత ఏడాది సైతం ఆగస్టులో దాదాపు 35 వేల ఎకరాల్లో పంట నష్టపోయామని, సర్వే చేసినా పరిహారం మంజూరు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 3.40 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఆయా నదుల పరీవాహక ప్రాంతాల్లో సుమారు 50వేల ఎకరాల్లో పంటలు రైతులు పండిస్తున్నారు. ప్రాణహిత, పెన్‌గంగ ప్రస్తుత వరదలతో సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లోని దాదాపు 10 వేల ఎకరాల పంట నష్టపోయింది. దహెగాం,



పెంచికల్‌పేట్ మండలాల్లోని పలు గ్రామాల్లో పెద్దవాగు జలాలు పత్తి పంటకు తీవ్ర నష్టం కలగజేశాయి. ఇక అన్ని మండలాల్లో ఉన్న చిన్నపాటి వాగులు, ఒర్రెల ప్రవాహంతో అనేక పత్తి చేలు నీళ్లల్లోనే ఉంటున్నాయి. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పత్తి మొక్కలు నిరంతరం నీళ్లలో ఉండటంతో ఆకులు నల్లగా మారి రాలిపోతున్నాయని, మరికొన్ని రోజులు వరద నీటిలోనే పత్తి మొక్కలు ఉంటే పూర్తిగా ఎండిపోయి తొలగించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోరాన్, పొటాషియంను లీటరుకు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పత్తి మొక్కలపై పిచికారీ చేస్తే ఆకులు నల్లగా మారే సమస్య తగ్గుతుందని పేర్కొంటున్నారు. నిలిచిన నీటిని వెంట వెంటనే తొలగించాలని సూచించారు.

తప్పని పెట్టుబడి భారం..

నెల, నెలన్నర కిందట నాటిన పత్తి పంట చాలా వరకు వర్షార్పణం కావడంతో.. అన్నదాతలు మళ్లీ విత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దఫాలుగా ఎరువులు వేశారు. ఇప్పటికే అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టామని, మళ్లీ విత్తనాలు తెచ్చి వేయాలంటే ఆర్థిక భారం అవుతుందని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షాలకు నష్టపోయిన పంటల సర్వే గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు అంటున్నారు.

ఇప్పటి వరకు రూ.40 వేల పెట్టుబడి సిర్పూర్(టి) మండలం దుబ్బగూడ గ్రామానికి చెందిన బాబురావు నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశారు. పెన్‌గంగ జలాలతో పంట పూర్తిగా నీట మునిగింది. రూ.40 వేల వరకు పెట్టుబడి ఖర్చయిందని, అధికారులు ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు. పరిహారం అందించాలి సిర్పూర్(టి) మండలానికి చెందిన రామ్‌చందర్ మూడు ఎకరాల్లో పత్తి సాగు చేయగా ప్రస్తుత వర్షాలతో పూర్తిగా మునిగిపో యింది. మొక్కలన్నీ నల్లగా మారుతున్నాయి. పెన్‌గంగ జలాలు చుట్టుముట్టి ఏటా ఈ ప్రాంతంలో వేలాది ఎకరాల పంటలు నీట మునుగుతున్నాయని పరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# వంతు వచ్చేవరకు..ఉగ్గబట్టుకోవాల్సిందే..!



కోరుట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టగా ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది. నిధుల కొరతతో చాలా పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. చాలా పాఠశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులుంటే ఒకటి రెండు మూత్రశాలలు, మరుగు దొడ్లు ఉండగా విద్యార్థుల బాధ వర్ణనాతీతం. ఉన్నవి కూడా శిథిలావస్థలో ఉండడం సరైన సౌకర్యాలు లేవు. మూత్రశాలల ముందు బారులు తీరుతూ ఉగ్గ పట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జూనియర్ కళాశాలకు వెళ్లాల్సిందే**

కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మూత్రశాలలను వినియోగించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాలలో విద్యార్థినులు 252 మంది, విద్యార్థులు 60 మంది కలిపి మొత్తం 312 మంది చదువుకుంటున్నారు. పాఠశాలలో పాత మూత్రశాలలు ఉండటంతో వాటిని పూర్తిగా తొలగించారు. ఆ స్థలంలో మనబస్తీ–మనబడి కింద మంజూరైన నిధులతో తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. పనులు ప్రారంభించి ఏడాది గడిచినా పిల్లర్ల నిర్మాణం చేపట్టి గుత్తేదారు మధ్యలోనే వదిలేశారు.

**278 మందికి రెండే మరుగుదొడ్లు**

ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో మొత్తం 278 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో కేవలం రెండే మరుగు దొడ్లు ఉండగా వాటి పక్కన ఓపెన్ మూత్రశాలలున్నాయి. పాఠశాలను మన ఊరు–మన బడిలో ఎంపిక చేయగా నిర్మాణాలు మధ్యలో నిలిచి పోయాయి. ఉన్న మూత్రశాలల వద్ద నిత్యం విద్యార్థులు విరామ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎస్ఎస్ఏ పథకంలో భాగంగా మూత్రశాలల నిర్మాణాన్ని ప్రారంభించగా గుత్తేదారుడికి బకాయిలు రాకపోవడంతో నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేయడంతో మూత్రశాలలు అందుబాటులోకి రాలేదు.

**మరమ్మతు చేపట్టడంలో నిర్లక్ష్యం**

రాయికల్ మండలంలో 32 గ్రామాలు ఉండగా 12 ఉన్నత, 41 ప్రాథమిక పాఠశాలలున్నాయి. మండల వ్యాప్తంగా 3638 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రెండు ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాల ఉండగా విద్యార్థులకు సరిపడా మూత్రశాలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సి వస్తోంది. గడికోట ప్రాథమిక పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఒకే మరుగుదొడ్డి, అల్లీపూర్ ఉన్నత పాఠశాలలో 301 మంది విద్యార్థులకు రెండు మూత్రశాలలు, మరుగుదొడ్డి మాత్రమే ఉన్నాయి. గతంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన మూత్రశాలలు మరమ్మతు చేయకపోవడంతో వినియోగానికి దూరమయ్యాయి. పాఠశాలలకు రెండు మరుగుదొడ్లు, వంట గదుల నిర్మాణానికి రూ.28 లక్షల చొప్పున మంజూరు కాగా పనులు ప్రారంభం కాలేదు.

**నీటి వసతి లేక..**

సారంగాపూర్ మండలంలో అయిదు ఉన్నత, మూడు ప్రాథమికోన్నత, 25 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మండలంలోని రేచపల్లిలో ఒకే ఆవరణలో ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఇందులో ఉన్నత పాఠశాలలో 203, ప్రాథమిక పాఠశాలలో 49, అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో కేవలం రెండే మూత్రశాలలు ఉన్నాయి. రంగపేటలో 93, అర్పపల్లిలో 99 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ మూత్రశాలల నిర్మాణాలు చేపట్టినప్పటికీ అర్ధంతరంగా పనులు నిలిపివేయడంతో బాలికలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మిగతా పాఠశాలల్లో మూత్రశాలలు ఉన్నప్పటికీ నీటి వసతి లేకపోవడంతో ముక్కుమూసుకొని పోవాల్సిన పరిస్థితి.

# అంచనాలను 'భట్టి' కేటాయింపులు



హైదరాబాద్: :కాంగ్రెస్ ప్రభుత్వ మొదటి పద్దులో అంచనాల నుబట్టి కేటాయింపులు జరిగాయి. మహానగరం చుట్టూ టౌన్‌షిప్‌లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 5 కి.మీ. పరిధిలో నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. భద్రత విషయంలో ప్రాధాన్యమిస్తూ రాజధాని పోలీసింగ్‌కు రూ.345 కోట్లు కేటాయించింది. వీటిలో హైదరాబాద్ కమిషనరేట్‌కు ఎక్కువ ఇచ్చింది. ఎంఎంటీఎస్ రెండోదశ పూర్తయినా కొత్త రైళ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.50 కోట్లు కేటాయించింది. ఇలా అంచనాల ఖర్చు ఎలా ఉన్నా.. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆచితూచి హద్దుల్లో ఉండేలా పద్దులు రాశారు.

బాహ్యవలయ రహదారి వరకు భాగ్యనగరమే. ఈ ప్రాతిపదికనే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్ జిల్లా పూర్తిగా, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలు పాక్షికంగా నగర పరిధిలోకి వస్తున్నాయి. రాజధాని పరిధిలో ఉండటంతో వేర్వేరు రంగాల్లో ఈ జిల్లాలు అగ్రపథంలో ఉన్నాయి. కొన్నింటి విషయంలో మెరుగు కావాల్సి ఉందనే సంకేతాలను శాసన సభలో గురువారం బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన తెలంగాణ–ఆర్థిక సామాజిక విశ్లేషణ–2024 నివేదిక వెల్లడించింది. తలసరి ఆదాయంలో.. తలసరి ఆదాయంలో ప్రస్తుత ధరలు(2022–23) ప్రకారం రంగారెడ్డి జిల్లా రూ.9,46,862 మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్ రూ.4,94,033 రెండో స్థానంలో ఉండగా.. సంగారెడ్డి జిల్లా రూ.3,22,394 మూడో స్థానంలో, మేడ్చల్ జిల్లా 2,95,514 నాలుగో స్థానంలో నిలిచింది.

ఉత్పత్తులలోనూ మనమే.. జిల్లా స్థూల ఉత్పత్తులు గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రాడక్ట్(జీడీడీపీ) ప్రకారం రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలు వరసగా మొదటి నాలుగు స్థానంలో ఉన్నాయి.

రంగారెడ్డి జిల్లాలో వార్షికంగా (2022–23 ) ప్రస్తుత ధరల ప్రకారం రూ.2,83,410 కోట్ల విలువైన వస్తుసేవల ఉత్పత్తితో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. హైదరాబాద్ రూ.2,28,623 కోట్లు, మేడ్చల్ మల్కాజిగిరిలో రూ.88,867 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో రూ.60,401 కోట్ల విలువైన ఉత్పత్తులు వెలువడ్డాయి.

టౌన్‌షిప్‌లకు చకచకా అడుగులు!

**పేద, మధ్య తరగతి వర్గాలకు అందులో నివాసాలు**

మహా నగరం చుట్టూ టౌన్‌షిప్‌లు సాకారం కానున్నాయి. వీటిని ప్రోత్సహిస్తామని తాజా బడ్జెట్‌లో విత్త మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. వాటిలో పేదలు, మధ్యతరగతి వర్గాలకు నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో ప్రత్యేక టౌన్‌షిప్ పాలసీని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అవుటర్ తరువాత 5 కిలోమీటర్ల పరిధిలో టౌన్‌షిప్‌ల నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఇప్పటికే కొన్ని సంస్థలు ముందుకొచ్చి దరఖాస్తు చేసుకున్నాయి. తాజా బడ్జెట్‌లో వాటిని ప్రోత్సహించేందుకు సంసిద్ధత వ్యక్తంచేయడంతో హెచ్ఎండీఏ ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఇప్పటికే రెండు ప్రాజెక్టులకు సంబంధించి హెచ్ఎండీఏకు దరఖాస్తులు అందాయి. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు హెచ్ఎండీఏ గతంలో నోటిఫికేషన్ జారీచేసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం దామర్లపల్లి ప్రాంతంలో 533 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మాణానికి ఓ సంస్థ దరఖాస్తు చేసింది. ఇదే జిల్లాలోని నందిగామ మండలం చేగూరు ప్రాంతంలో 100 ఎకరాల్లో టౌన్‌షిప్‌నకు మరో సంస్థ కూడా దరఖాస్తు చేసింది.

**రాజధాని పోలీసింగ్‌కు రూ.345 కోట్లు**

హైదరాబాద్ కమిషనరేట్‌కు రూ.316 కోట్లుబడ్జెట్‌లో రాజధాని పోలీసింగ్‌కు ఈసారి భారీగానే నిధులు దక్కాయి. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు నిధుల్లో కోత విధించినా.. హైదరాబాద్‌కు భారీగా కేటాయింపులు పెరిగాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మూడు కమిషనరేట్లకు సవరించిన అంచనాలతో కలిపి ప్రభుత్వం రూ.226.32 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.345.84 కోట్లకు పెరిగింది. హైదరాబాద్‌కు గతేడాది రూ.176.26 కోట్లు కేటాయించగా.. ఈసారి 316.44 కోట్లు ప్రతిపాదించింది. అంటే దాదాపు రూ.140 కోట్లు (40 శాతం) మేర నిధులు పెరిగాయి. సైబరాబాద్‌కు రూ.24.28 కోట్ల నుంచి రూ.20 కోట్లకు తగ్గాయి. రాచకొండ కమిషనరేట్‌కూ నిరాశే. గతేడాది రూ.25.48 కోట్ల కేటాయింపులుండగా ఈసారి రూ.9.4 కోట్లు మాత్రమే దక్కాయి.

**రూ.లక్షతో కార్యాలయ నిర్మాణమా?**

రాచకొండ కొత్త కమిషనరేట్ భవన నిర్మాణానికి రూ.లక్ష మాత్రమే ప్రతిపాదించారు. కమిషనరేట్ ఏర్పాటై 8 ఏళ్లవుతున్నా ప్రధాన కార్యాలయం తాత్కాలిక భవనంలోనే కొనసాగుతోంది. మేడిపల్లిలో స్థలం కేటాయించి భవన నిర్మాణం ప్రారంభించినా నిధుల లేమితో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

**నిఘా నేత్రాలకు రూ.50 కోట్లు**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీసీటీవీ సర్వైలెన్స్ కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రతిపాదించగా సవరించిన అంచనాల తర్వాత రూ.58.61 కోట్లు కేటాయించింది. సేఫ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా మహిళా భద్రత(నిర్భయ ఫండ్) కింద రూ.50 కోట్లు కేటాయించింది. వ్యవస్థీకృత నేరాలు, ముఠాలపై పోరాటంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి వీలుగా రూ.18 కోట్లు కేటాయించింది.

**ల్యాండ్ పూలింగ్‌తో..**

ప్రభుత్వ భూముల్లో కూడా టౌన్‌షిప్‌ల అభివృద్ధికి ప్రభుత్వం యోచిస్తోంది. హెచ్ఎండీఏకు మాత్రమే వర్తించేలా 2020లో ప్రభుత్వం 'తెలంగాణ కాంప్రహెన్సివ్ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పాలసీ'ని తీసుకొచ్చింది. ఓఆర్ఆర్ దాటి 5 కిలోమీటర్ల తర్వాతే టౌన్‌షిప్ ఉండాలి. ఆ భూమికి భూ వినియోగ మార్పిడి అవసరం లేదు. కనీసం 100 ఎకరాల భూమి ఒకేచోట ఉంటేనే అనుమతులిస్తారు. ప్రభుత్వ భూమి లేకపోతే రైతుల నుంచి సేకరించి అభివృద్ధి చేసి కేటాయించాలి. అంతర్గత రహదారులు 30–60 అడుగులుండాలి. నివాస, వాణిజ్య, విద్యా, ప్రజా అవసరాలు, హెల్త్‌కేర్, మౌలిక వసతులు, ప్రజారవాణా, ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్ హౌసింగ్, రోడ్లు, పార్కులు, ఆటస్థలాలకు భూ కేటాయింపులు తప్పనిసరి.

# సామర్థ్యాలకు అనుగుణంగా..

## బోధన సాగేలా!

ఖమ్మం : విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు దేశంలోనే అతిపెద్ద సర్వే నవంబరు నుంచి నిర్వహించనున్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ న్యాస్ (నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే) చేపట్టనుంది. జాతీయ స్థాయిలో విద్యార్థుల జ్ఞానం, అర్థం చేసుకోగలిగే సామర్థ్యాలపై విస్తృత సమాచారం సేకరించనున్నారు. 2017, 2021లో ఈ సర్వే నిర్వహించగా.. ఈ ఏడాది నవంబరులో జరుగుతుంది. దీనికి సంబంధించి ఇటీవల రాష్ట్రస్థాయిలో కార్యశాల నిర్వహించారు. మోడల్ టెస్టు ఐటెమ్స్ తయారు చేశారు. ఈనెల 22న రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ఇద్దరు చొప్పున జిల్లా రిసోర్స్‌పర్సన్లకు రాష్ట్రస్థాయిలో నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఇది హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగింది. రిసోర్స్‌పర్సన్లు తమ జిల్లాల్లో ఈనెల 26, 27 తేదీల్లో జరిగే శిక్షణలో పాల్గొంటారు. ఈ శిక్షణకు ప్రతి స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఇద్దరు రిసోర్స్‌పర్సన్‌లు హాజరవుతారు. వారు 30, 31 తేదీల్లో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు



తర్ఫీదు ఇస్తారు. తర్వాత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని తమ పాఠశాలల్లో దీనిని ఎలా అమలుచేయాలో ప్రణాళిక రూపొందిస్తారు.

సర్వే నిర్వహించే పాఠశాలలు

ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, గుర్తింపు పొందిన ప్రైవేటు, కేంద్ర ప్రభుత్వ నవోదయ, ఆదర్శ పాఠశాలల్లో సర్వే నిర్వహించనున్నారు. 3వ తరగతి భాష, గణితం, ఈవీఎస్, 6వ తరగతికి భాష, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం, 9వ తరగతికి భాష, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం, ఆంగ్లం సబ్జెక్టులపై సర్వే నిర్వహిస్తారు. 2017లో 3, 5, 8 తరగతులకు సర్వే జరపగా.. 2021లో 3, 5, 8, 10 తరగతులకు నిర్వహించారు. ఈ ఏడాది 3, 6, 9 తరగతులకు సర్వే జరగనుంది. న్యాస్ పరిశోధనలు విద్యార్థుల అభ్యాసన అంతరాలను నిర్ధారించడంలో సహాయపడతాయి. విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, అభ్యాసంలో అవసరమైన మార్పులు తీసుకురావచ్చు. న్యాస్ పరిశోధనలు అధికారులు, ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయి. పెసర ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్

# సాగు ప్రశ్నార్థకం..!

మాగనూరు : చిట్టెం నర్సిరెడ్డి రిజర్వాయరు లోలెవల్ కాలువకు అదును దాటుతున్నా నీరు వదలడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. ఆగస్టు నాటికి వరినాట్లు పడాలి. కాగా కుడి లోలెవల్ కాలువ కింద ఇప్పటి వరకూ నీరు వదల్లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లోలెవల్ కుడి కాలువ కింద నేరేడ్‌గం మొదలుకొని వర్కూరు, మాగనూరు, అచ్చంపేట, పెగడబండ, అడవిసత్యవార్ రైతులు ఆధారపడి ఉన్నారు. ఏళ్లుగా సేవలందిస్తున్న ఈ కాలువకు ఇంత వరకూ లైనింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఎక్కడికక్కడ జమ్ము మొలచి నీరు దిగువకు రావడం లేదు. దీంతో ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారుతోంది.

కాలువ నిర్వహణలో లోపం..

లోలెవల్ కాలువ నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. చాలా మంది రైతులు పంటల సాగు ఆరంభంలో మాత్రమే కాలువ రావడం లేదని ఆందోళన చేస్తున్నారు. కాలువ నిర్వహణ ఎవరు చూస్తున్నారన్నది ఎవరూ పట్టించుకోవడం లేదు. లోలెవల్ కాలువకు ఇప్పటి వరకూ లైనింగ్ చేయని విషయం అందరికీ తెలిసిందే. కాలువ మరమ్మతులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడం వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకూ కాలువకు నీరు వదల్లేదని స్పష్టమవుతోంది. రైతులందరూ కలిసి కాలువ మరమ్మతులు చేసుకుంటే తప్ప నీరు వదల్లేని పరిస్థితి నెలకొంది.

అధికారులు అంతంత మాత్రమే..

చిట్టెం నర్సిరెడ్డి రిజర్వాయరు కింద కుడి లోలెవల్, ఎడమ లోలెవల్ కాలువలు ఉన్నాయి. ఒక కాలువ 19 కి.మీ మరో కాలువ 20 కి.మీ పరిధిలో సాగు నీరు అందిస్తున్నాయి. వీటి నిర్వహణకు ఒక డీఈ ఒక ఏఈ ముగ్గురు లష్కర్లు మాత్రమే ఉన్నారు. రైతులతో కమిటీ



ఏర్పాటు చేసి కాలువ పరిశీలనకు మరి కొంత మందిని నియమించి చివరి ఆయకట్టు వరకూ నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతులంతా కలసి కాలువ పూడిక తీయించాం

– పవన్ మాగనూరు యువ రైతు

గతంలో రైతులంతా కలసి కాలువ పూడిక తీయించాం. జులై మొదటి వారంలో నారు మడులు పోయాలి. కాగా ఈ ఏడాది ఇంతవరకూ కాలువ వదల్లేదు. వర్కూరు శివారులో కాలువ తెగిపోయింది. ఇంతవరకూ మరమ్మతులు చేయలేదు. చాలా వరకూ కాలువకు ముందు ఉన్న రైతులకు నీరందుతుంది. చివరికి వచ్చే సరికి నీరు రావడం లేదు. రైతులతో కమిటీ ఏర్పాటు చేసి లష్కర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

లైనింగ్ కోసం ప్రతిపాదనలు పంపించాం..

–ఏఈ బలరాం, చిట్టె నర్సిరెడ్డి రిజర్వాయరు

కుడి లోలెవల్ కాలువ కింద ఆయకట్టు చాలా ఉంది. ఇంతవరకూ ఎన్ని ఎకరాలన్నది నిర్ధారణ కాలేదు. ప్రధానంగా కాలువ లైనింగ్ లేకపోవడంతో పెద్ద వర్షాలు వచ్చినప్పుడు కాలువ తెగిపోతుంది. ఇటీవల వర్కూరు శివారులో కాలువ తెగి గండి పడింది. నిధులు లేక మరమ్మతు చేయలేదు. వెంటనే కాలువ మరమ్మతులు చేయించి నీరు వదిలే ఏర్పాటు చేస్తాం. కాలువ లైనింగ్‌కు ప్రతిపాదనలు పంపించాం. రైతులకు ఆయకట్టుపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

# ఎంపిక సరే.. ప్రోత్సాహకమేదీ?

సారంగాపూర్: నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోపాటు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్) ద్వారా ఎంపిక చేసిన ఆసుపత్రులకు కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఎంపిక చేసిన ఆసుపత్రులకు నిధులు సమకూరకపోవడంతో ఎదురు చూపులు తప్పడంలేదు. జిల్లాలో నాణ్యత ప్రమాణాలు, వైద్య సేవలు సరిగా ఉన్న ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఈ నిధులతో అసుపత్రుల పనితీరును మరింత మెరుగు పరుస్తారు. జిల్లా వ్యాప్తంగా పలు దఫాలుగా దాదాపు 19 వివిధ ఆసుపత్రులను ఎంపిక చేయగా నిధులు రాకపోవడంతో మెరుగైన వసతులు అందించలేకపోతున్నట్లు సిబ్బంది వాపోతున్నారు.

**ఎంపిక ఇలా..!** ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యత ప్రమాణాలతో వైద్య సేవలు అందించడం, అవసరమైన మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం తదితర ఎనిమిది విభాగాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలిస్తారు. అన్ని సరిగా ఉన్న ఆసుపత్రులను ఎన్‌క్వాస్‌కు ఎంపిక చేస్తారు. ఎంపికైన వాటికి మూడేళ్ల పాటు ఏటా నిధులు విడుదల చేస్తారు. ఇందులో ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున, పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఏటా రూ.2లక్షలు, పల్లె దవాఖానాలు, ఉప కేంద్రాలకు రూ.1.50



లక్షల చొప్పున మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తారు. ఎంపికైన ఆసుపత్రులకు నిధులు సమకూరకపోవడంతో ఇప్పటికే వివిధ పనులకు సొంతంగా డబ్బులు వ్యయం చేసిన సిబ్బందికి ఇబ్బందిగా మారింది. జిల్లాలో వివిధ మండలాల్లోని పలు ఆసుపత్రులు ఎన్‌క్వాస్ కింద ఎంపికయ్యాయి. ఇందులో ఇబ్రహీంపట్నం, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, పెగడపల్లి, కొడిమ్యాల, ఖిలాగడ్డ, జేఎస్‌రామ్‌వెల్, మోతెవాడ, ఆత్మకూర్, పైడిమడ్గు, వేములకుర్తి, ధరూర్, మోతె, నూకపల్లి, జగిత్యాల, రేచపల్లి, కట్కాపూర్, దొంతాపూర్ ఆసుపత్రులు ఉన్నాయి. **ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**ఎన్‌క్వాస్ కింద ఎంపికైన ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఎంపికైన ఆసుపత్రులకు నిధుల మంజూరుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. – షమీయొద్దీన్, జిల్లా వైద్యాధికారి

# కాల్వలపై నిర్లక్ష్యం.. కనుమరుగైన లక్ష్యం

నకిరేకల్: ఏఎమ్మార్పీ కాల్వలు నిర్మించి దశాబ్దన్నర దాటిపోయింది. అప్పటి నుంచి కాల్వలకు మరమ్మతులు మరిచిపోయారు. దీంతో కాల్వలు పొదలతో నిండిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కాల్వల్లో దోసెడు మట్టి తియ్యకపోవడం వల్ల పూడిపోయాయి. గేట్లు కొట్టుకుపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా.. ఏఎమ్మార్పీ కాల్వలపై దృష్టి సారించిన పాపానపోలేదు. దీంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకుంది. ఏఎమ్మార్పీ కాల్వలను పరిశీలించగా..అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

కొట్టుకు పోయిన గేట్లు.. సాగు, తాగునీరు అందించే ఏఎంఆర్ ప్రాజెక్టుకు నకిరేకల్ చివరి ప్రాంతంగా ఉంది. ప్రాజెక్టుకు చివరి ప్రాంతంగా ఉన్న నకిరేకల్ డివిజన్‌లో ప్రధాన కాల్వ, మైనర్ల పరిస్థితి నిర్వహణ లేక అధ్వానంగా మారింది. పలు చోట్ల కాల్వలు రూపును కోల్పోయాయి. ప్రాజెక్టు నీటితో ఇక్కడి చెరువులు, కుంటలు నిండితే..బోర్లలో భూగర్భ జలాలు పెరగడం ద్వారా మాత్రమే పంటలు సాగుచేసుకుంటున్నారు. ప్రధాన కాల్వ 115 కి.మీ నుంచి 136.01 కి.మీ వరకు ఏళ్ల తరబడి నిర్వహణ లేక ఆనవాళ్లు కోల్పోతోంది. డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు, సబ్ మైనర్ల షట్టర్లు తుప్పుపట్టి ధ్వంసమయ్యాయి. కొన్ని కొట్టుకు పోయాయి. గత ఏడాది వీటి మరమ్మతుల కోసం రూ.27 లక్షలు కేటాయించినా పనులు కార్యరూపం దాల్చలేదు.

**ముళ్ల పొదలు.. చెట్లతో నిండి..**

తిప్పర్తి మండలంలోని ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలు అధ్వానంగా మారాయి. పానగల్ ఉదయ సముద్రం నుంచి పంటల సాగుకు నీరందించేందుకు దశాబ్దన్నర క్రితం ఏఎమ్మార్పీ కాల్వలు నిర్మించారు. మండల పరిధిలో డి-37, డి-39, డి-40 ప్రధాన కాల్వలు, పిల్ల కాల్వలు తవ్వారు. ప్రధాన డిస్ట్రిబ్యూటరీ కాలువలు అధ్వానంగా మారడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదు.

మండలంలో డి-37, డి-39, డి-40 ప్రధాన కాల్వలతోపాటు పంట కాల్వలు పూర్తిగా ముళ్లపొదలు, పిచ్చి చెట్లతో నిండిపోయాయి. లైనింగ్, బ్యాంకింగ్ సక్రమంగా లేకపోవడంతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాల్వలు అధ్వానంగా మారుతున్నాయి. కొందరు రైతులు రాళ్లు వేయడం, పలు చోట్ల గండ్లు పెట్టడం, కాల్వలను పూడ్చివేస్తుండటంతో కాల్వ ఆనవాళ్లు కూడా ఉండటంలేదు. ఇప్పటికే అనేక పిల్ల కాల్వలు కనుమరుగవుతున్నాయి. ఏఎమ్మార్పీ కాలువలు అధ్వానంగా మారడంతో కింది రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. పజ్జూరు, ఇందుర్లూరు, రాజుపేట, ప్రాంతంలో కాల్వలు పూర్తిగా ముళ్లపొదలతో నిండిపోయింది. –చివరికి అందని నీరు

పదహారేళ్ల క్రితం ఏఎంఆర్‌పీ కాల్వలు తవ్వారు.. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటి మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. దీంతో చి'వరి'కి సాగు నీరు అందని పరిస్థితి. కాల్వలు మట్టి, ముళ్ల పొదలతో నిండిపోగా చివరికి సాగునీరు అందక పోవడంతో ఎగువ- దిగువ ఆయకట్టు రైతుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. నల్గొండ నియోజకవర్గంలో 60వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే ఏఎమ్మార్పీ కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కాల్వలు నిర్మించి 16 ఏళ్లు దాటిపోయింది.

డి-25,6ఎల్ బుడమర్లపల్లి వద్ద కాలువ లైనింగ్, బ్యాంకింగ్ పూర్తిగా దెబ్బతింది. ఇదే కాలువ లచ్చుగూడెం సమీపంలో కాల్వలోని అలుగు పూర్తిగా కోతకు గురయ్యాయి.డి- 28 పగిడిమర్రి సమీపంలో కాల్వ లైనింగ్ కోతకు గురైంది.

# ముసుగేసిన వ్యాపారాలు



వేములవాడ : ఆషాఢానికి తోడు నాలుగు రోజులుగా పడుతున్న వర్షం కారణంగా ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడలోని చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారం సాగక దుకాణాలకు ముసుగేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావడంతో శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి రోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తుంటారు. అనుబంధ ఆలయాలైన బద్ది పోచమ్మకు బోనాల మొక్కులు చెల్లించుకుంటారు. ఆషాఢం కావడంతో భక్తుల రాక బాగా తగ్గిపోయింది. పైగా నాలుగు రోజులుగా ముసురు కారణంగా పట్టణంలోని రహదారుల్లో జన సంచారం అంతంత మాత్రంగానే ఉండటంతో వెలవెలబోతున్నాయి. పట్టణంలోని ఆలయ పరిసర వీధులు ఇతర రోజుల్లో భక్తులు, స్థానికులతో కిక్కిరిసిపోయి నడవడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అలాంటిది ప్రస్తుతం నిర్మాణుష్యంగా మారాయి. ఎటువైపు చూసినా దుకాణాలకు కవర్లు కప్పి దర్శనమిస్తున్నాయి. ప్రధాన ఆలయ పరిసరాల్లోని రోడ్ల వెంబడి వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. వీధి వ్యాపారులు గిరాకీ లేక తోపుడు బండ్లకు కవర్లు కప్పి మూసేశారు. ఆలయ పరిసరాల్లోని దాదాపు వేయి మందికిపైగా వీధి వ్యాపారులు, మరో రెండు వేల మందికి పైగా దుకాణదారులు ఉంటారు. పొట్టకూటి కోసం కొందరు వీధి వ్యాపారులు దుకాణాలను తెరుచుకొని గిరాకీ కోసం ఎదురుచూస్తున్నారు.

**తీర్థయాత్రలకు...**

పట్టణంలోని చాలా దుకాణాల నిర్వాహకులు తీర్థయాత్రలకు వెళ్లారు. ఆషాఢం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు రాకపోవడంతో ఆలయ పరిసరాల్లోని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు తీర్థయాత్రలకు వెళ్లారు. ఆలయ పరిసరాల్లో చాలా వరకు బొమ్మలు, ఆట వస్తువులు, బెల్లం, కొబ్బరికాయలు, పూలు, పూజా సామగ్రి వంటివి విక్రయిస్తుంటారు. శ్రావణ మాసం వస్తే తప్ప వ్యాపారాలు పూర్తి స్థాయిలో జరిగే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో చిన్న, చిన్న వ్యాపారులు దుకాణాలను మూసేసి తీర్థయాత్రలకు వెళ్లారు. ప్రస్తుతం వ్యాపారాలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. గతంలో ఒక్కో వ్యాపారి రోజుకు రూ. 2 వేలకు పైగా విక్రయిస్తే, ప్రస్తుతం సెల్‌ఫోన్లు చూసుకుంటూ కూర్చుంటున్నారు. వీధి వ్యాపారులు సైతం రోజుకు రూ.100 కూడా గిరాకీ కావడం లేదని వాపోతున్నారు.

**గిరాకీ లేదు**

నాలుగు రోజుల నుంచి వానతోపాటు ఆషాఢం కావడంతో వ్యాపారం జరగడం లేదు. అంతకు ముందు రోజుకు రూ.వేయి నుంచి రూ.1,500 వరకు అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం రోజుకు కనీసం రూ.100 కూడా అమ్మడం లేదు. ఇంటి దగ్గర పని లేక వర్షంలోనూ దుకాణం నడిపిస్తున్నా.– లావణ్య, రాజన్న ఆలయ రోడ్డు

**ఈ నెలంతా నష్టమే**

ఓవైపు ఆషాఢం, మరోవైపు వాన కారణంగా గిరాకీ లేదు. ఆషాఢం నుంచి గిరాకీ పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం రోజుకు రూ.200 కూడా రావడం లేదు. ఈ నెలలో షట్టరు కిరాయి జేబులో నుంచి భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుకాణం తెరిచి కూర్చోవడమే తప్ప వ్యాపారం ఏమీ లేదు.

– ఆడెపు శ్రీనివాస్, బద్దిపోచమ్మ వీధి

# జనన ధ్రువపత్రాలకు అగచాట్లు




జగిత్యాల : పురపాలక కార్యాలయంలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ నెల రోజులుగా నిలిచిపోవడంతో దరఖాస్తులు పేరుకుపోయాయి. ఫలితంగా దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. గత 15 రోజుల్లో 600 జనన ధ్రువీకరణ దరఖాస్తులు అపరిష్కృతంగా మారాయి. కమిషనర్ అనిల్ పోలీసు కేసులో పరారీలో ఉండగా తరువాత ఇన్‌ఛార్జులుగా ఇద్దరు బాధ్యతలు చేపట్టడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీకి నోచుకోలేకపోయాయి. తాజాగా పది రోజుల కిందట నూతన కమిషనర్‌గా సమ్మయ్య బాధ్యతలు చేపట్టినప్పటికీ ఇతరత్రా పనుల కారణంగా పూర్తిస్థాయిలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలేదు. ప్రతిరోజూ 80కి మించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేకపోవడంతో 500 దరఖాస్తులు నిలిచిపోయాయి.

**దరఖాస్తుదారుల ఇబ్బందులు..**

నిబంధనల మేరకు జనన, ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారం రోజుల్లోపు అందజేయాల్సి ఉంది. గత 3 నెలలుగా బల్దియాలో పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతోపాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆధార్, విద్య, బీమా తదితర అన్ని అవసరాలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జగిత్యాల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు స్థానిక పురపాలక కార్యాలయమే జారీ చేయాల్సి ఉంటుంది. సకాలంలో ధ్రువీకరణ పత్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మరణ ధ్రువీకరణ పత్రాలు నేరుగా బల్దియా కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. వీటిపైనా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.

**ఆసుపత్రుల నిర్లక్ష్యం..**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తమవద్ద జన్మించిన శిశువుల వివరాలు ప్రతినెలా బల్దియాకు అందజేయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగానే బల్దియా జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తోంది. స్థానిక సాధారణ ఆసుపత్రి సిబ్బంది కొన్ని నెలలుగా శిశువుల వివరాలు బల్దియాకు అందజేయకపోవడంతో ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రధానంగా 2023కు ముందు వివరాలు సాధారణ ఆసుపత్రి నుంచి ఇప్పటి వరకూ బల్దియాకు చేరవేయకపోవడం గమనార్హం. ఈ సమయంలో పుట్టిన శిశువుల ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో లభ్యం కాకపోవడంతో సాధారణ ఆసుపత్రి నుంచి మాన్యువల్‌గా వివరాలు కావాలని బల్దియా కోరుతోంది. ఈ క్రమంలో వివరాల కోసం దరఖాస్తుదారులు సాధారణ ఆసుపత్రికి వెళ్తే ఈ విభాగం ఇక్కడి నుంచి మాతాశిశు కేంద్రానికి తరలించారని చెబుతున్నారు. దరఖాస్తుదారులు ఎంసీహెచ్‌లో ఉన్న నాలుగో అంతస్తుకు వెళ్లి వాకబు చేస్తే ఆధార్, ఇతర జిరాక్స్‌ల కోసం తిప్పి పంపడంతో ప్రయాస పడాల్సి వస్తోంది. దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

**త్వరలోనే పూర్తి చేస్తాం**

దాదాపు జనన ధ్రువీకరణ పతాలు పెద్దమొత్తంలో జారీ చేశాం. మిగిలినవి రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయి. మరణ ధ్రువీకరణ పత్రాలు మాత్రం ఇంకా జారీ కాలేదు. నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. త్వరలోనే అన్నింటిని దరఖాస్తుదారులకు అందజేస్తాం. – సమ్మయ్య కమిషనర్, జగిత్యాల

# ఈ ఏడాదే వైద్య కళాశాల ఏర్పాటు

భువనగిరి : యాదాద్రి ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్యమండలి పచ్చజెండా ఊపినట్లు సమాచారం. ఎన్ఎంసీ బృందం పరోక్ష తనిఖీ సందర్భంగా లేవనెత్తిన అభ్యంతరాలు, సదుపాయాలు, వైద్యకళాశాల కోసం బదిలీపై వచ్చిన క్లినికల్, నాన్‌క్లినికల్ సిబ్బంది జాబితా వివరాలు, ఇతర అంశాలను సరిచేసిన తర్వాత తుది అనుమతుల కోసం గురువారం వర్చువల్ తనిఖీ నిర్వహించారు. వైద్యకళాశాల ప్రిన్సిపల్ రమేశ్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు, ఇప్పటి వరకు ప్రిన్సిపల్‌గా ఉన్న మల్లికార్జున్ వర్చువల్‌గా జాతీయ వైద్య మండలితో సమావేశమయ్యారు. సుమారు రెండు గంటల పాటు సాగిన సమావేశంలో వైద్యకళాశాల ఏర్పాటు గురించి నివేదికను వారికి విన్నవించారు. అన్ని విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఒక్కొక్కరి వివరాలను ఎన్ఎంసీకి సమర్పించారు. కళాశాలకు కావాల్సిన 59 మంది సిబ్బంది వివరాలను అందజేశారు. బోధనాసుపత్రికి అనుబంధంగా జిల్లా కేంద్రాసుపత్రిని 220 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దిగా సర్దుబాట్లకు గురించి వివరించారు. జిల్లా వైద్య కళాశాల అధికారులు ఇచ్చిన వివరణపై ఎన్ఎంసీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎన్ఎంసీతో సమావేశం ప్రయోజనకరంగా సాగిందని వైద్యకళాశాల ఏర్పాటుకు దాదాపుగా అనుమతి లభించనున్నట్లు వైద్యాధికారుల అభిప్రాయం వ్యక్తం చేశారు. వైద్యకళాశాల ఏర్పాటు చేస్తూ ఎన్ఎంసీ నుంచి అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంటుందని తెలిపారు.

పాత కలెక్టరేట్ భవనంలో తరగతులు ఈ ఏడాది 50 సీట్లతో వైద్య కళాశాల ప్రారంభం కానుంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వైద్యవిద్య తరగతులు ప్రారంభించేందుకు పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ భవనం ఎంపిక చేశారు. జిల్లా కేంద్రాసుపత్రిని బోధనాసుపత్రిగా వైద్య విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. హైదరాబాద్‌కు దగ్గరలో ఉండటంతో రానున్న రోజుల్లో జిల్లాలో ఏర్పాటు కానున్న వైద్యకళాశాలకు డిమాండ్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కళాశాల శాశ్వత భవన నిర్మాణం కోసం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో 20 ఎకరాల స్థలం ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది.

# మహానగరికి ఊపిరి

హైదరాబాద్ : ఓ వైపు అప్పులు.. వడ్డీలు.. మరోవైపు నిలిచిన అభివృద్ధి పనులు.. గుత్తేదారుల ఆందోళనలు.. ఉద్యోగుల జీతాలు చెల్లించలేని స్థితిలో ఉన్న జీహెచ్ఎంసీకి రాష్ట్ర బడ్జెట్ ఊరటనిచ్చింది. తాజా బడ్జెట్‌లో రూ.3,065 కోట్లను కేటాయించి సర్కారు పెద్దపీట వేసింది. తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్ర పద్దులో జీహెచ్ఎంసీకి ఇదే అత్యధిక కేటాయింపు. మెట్రో ప్రాజెక్టులకు రూ.1,100 కోట్లు, జలమండలికి రూ.3,385 కోట్లు, మూసీ, హెచ్ఎండీఏ, హైడ్రా తదితర విభాగాలకు కలిపి మొత్తంగా రూ.10వేల కోట్లు కేటాయించి ప్రగతికి బాటలు వేసింది. పద్దులో పేర్కొన్నట్లుగా నిధులు అందితే నగరం అభివృద్ధి పథంలో దూసుకెళ్లడం ఖాయం.

సున్నా బిల్లులకు రూ.360 కోట్లు

నగర పరిధిలో గృహజ్యోతి పథకంలో సున్నా విద్యుత్తు బిల్లుల జారీకి ప్రభుత్వం ఏడాదిలో రూ.360 కోట్ల వరకు వ్యయం చేయనుంది. బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్తంగా సున్నా బిల్లుల రాయితీ కోసం రూ.2,418 కోట్లను మంత్రి ప్రతిపాదించగా.. ఇందులో నగర వాటా దాదాపుగా 15 శాతంగా ఉంది. జులైలో 7.40 లక్షల వినియోగదారులకు సున్నా బిల్లులు జారీ అయ్యాయి. మార్చిలో పథకం ప్రారంభం నుంచి జులై వరకు 105.11 కోట్ల మేరకు వినియోగదారులు లబ్ధి పొందారు. మార్చిలో 6.96 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా.. జులై నాటికి ఆ సంఖ్య 7.40 లక్షలకు పెరిగింది.

**ఓయూ, మహిళా వర్సిటీకి రూ.200 కోట్లు**

ఓయూ, మహిళా వర్సిటీల్లో అభివృద్ధి పనులు, వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఒక్కోదానికి రూ.100 కోట్ల చొప్పున కేటాయించింది. గత రెండేళ్లుగా ఈ రెండు వర్సిటీలకు కేటాయింపులు జరిపినా 80 శాతం నిధులు విడుదలవలేదు. దీంతో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మహిళా యూనివర్సిటీకి సంబంధించి వసతిగృహాలు, ఆడిటోరియం తదితర భవనాలను నిర్మించాల్సి ఉంది. ఓయూకు కూడా గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించినా మౌలిక వసతుల కోసం ఈ నిధులను పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో కొన్ని పనులు ప్రారంభం కాలేదు.

**మరో 100 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు**

నగరవాసులు విద్యుత్తు వాహనాల(ఈవీ) వైపు మొగ్గుచూపుతున్నా తగిన సంఖ్యలో ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వీటి సంఖ్య పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. ఇప్పటివరకు 450 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఉన్నాయని సర్కారు చెబుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రేటర్ పరిధిలో మరో 100 ఏర్పాటుచేయనున్నారు. వీటి ఏర్పాటుకు ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించనున్నారు.

**'డబుల్ ఇళ్లు పూర్తి చేస్తాం'**

నగరంలో లక్ష రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి పేదలకు ఉచితంగా ఇస్తామని గత సర్కారు పనులు చేపట్టింది. గతేడాది లాటరీ నిర్వహించి దాదాపు 69వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. మిగిలినవి నిధుల్లేక నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో స్పందిస్తూ.. నిలిచిన పనులను ప్రారంభించి ఇళ్లను ప్రజలకు అందజేస్తామని వెల్లడించింది.

లక్ష ఇందిరమ్మ ఇళ్లు : పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. నియోజకవర్గానికి 3,500 ఉంటాయని పద్దులో ప్రకటించింది. ఆ లెక్కన రాజధానిలోని మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 29 అసెంబ్లీ స్థానాలకు 1,01,500 ఇళ్లు అందనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షకుపైగా ఇళ్లను ఇవ్వాలని సర్కారు లక్ష్యంగా ఉంది.

**బల్దియాకు జీవం.. ప్రగతికి ఊతం..**

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సూచనతో జీహెచ్ఎంసీలో హై-సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు ఇటీవల రూపుదిద్దుకుంది. దీనికి రూ.3వేల కోట్లు అవసరమనేది అంచనా. ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పనులు ఏడాది చివరితో ముగియనున్నాయి. నిలిచిపోయే దశకు చేరిన ఆయా పనులకు హెచ్-సిటీతో జీవం పోయాలని సర్కారు నిర్ణయించింది. తాజా పద్దులో హెచ్-సిటీకి రూ.2,654 కోట్ల కేటాయింపే అందుకు నిదర్శనం. 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చే రూ.411కోట్ల కేటాయింపుతో కలిపితే మొత్తం బల్దియాకు కేటాయించిన నిధులు రూ.3,065కోట్లవుతాయి. నగరంలోని కులీకుత్‌బాషాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.13.38 కోట్లు కేటాయించారు.

**హైదరాబాద్ బ్రాండ్ పెంచేలా : క్రెడాయ్**

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్ ప్రగతిశీలకంగా ఉందని క్రెడాయ్ హైదరాబాద్ అభినందించింది. హైదరాబాద్ బ్రాండ్ పెంచే వ్యూహాత్మక బడ్జెట్ అని అభివర్ణించింది. మౌలిక వసతుల ప్రాజెక్టులకు గణనీయమైన కేటాయింపులతో హైదరాబాద్ స్థాయి పెంచేందుకు, రియల్‌ఎస్టేట్ రంగం వృద్ధికి దోహదం చేస్తుందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వి.రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.జగన్నాథరావు తెలిపారు. ప్రాంతీయ వలయ రహదారికి ప్రతిపాదించిన రూ.1525 కోట్లు రవాణా అనుసంధానం మెరుగుపర్చేందుకు దోహదం చేస్తుందని తెలిపారు.

**మూసీ మెరిసేలా**

మూసీకి మంచిరోజులు రాబోతున్నాయి. ఈ ఏడాదే ఈ నది సుందరీకరణ పనులు మొదలుకానున్నాయి. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో రూ.1,500 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. దీంతో ఆక్రమణలను తొలగించే ప్రక్రియను మొదలుపెట్టడానికి అవకాశం ఉంది. మూసీ వెంట ఉన్న ఆక్రమణదారులకు అసవరమైతే నష్ట పరిహారం ఇవ్వడానికి ఈ నిధులు వినియోగించే అవకాశం ఉంది. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో సుందరీకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ నదికి ఒకవైపు ఆకాశమార్గాన్ని నిర్మించి రెండు వైపులా మూడులైన్ల రహదారిని నిర్మించాలని తలపెట్టారు. నాగోల్ వరకు మెట్రో కూడా వేయాలని అనుకుంటున్నారు. మురుగు చేరకుండా శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. గోదావరి జలాలను జంటజలాశయాల్లోకి రప్పించి మూడు టీఎంసీల నీటిని మూసీలోకి రోజూ విడుదల చేయాలనేది ఆలోచన. ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ.10 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ నది తీరంలోనే వాణిజ్య భవనాలు, థియేటర్లు ఇతరత్రా పనులు చేపట్టనున్నారు. అందుకే బడ్జెట్‌లో రూ.1,500 కోట్లను కేటాయించారు.

**నిమ్స్‌కు రూ.61.06 కోట్లు**

ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులైన నిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలకు తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నిమ్స్‌లో అత్యవసర పరికరాల కొనుగోలు కోసం రూ.49.06 కోట్లు కేటాయించింది. ఇక ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు లేకుండా వచ్చే రోగులకు బడ్జెట్‌లో రూ.12 కోట్లు కేటాయించారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ ఆసుపత్రికి ఏటా రోగుల సంఖ్య పెరుగుతోంది. కొత్త భవనాల కోసం రూ.8 కోట్లు, జీతాలు ఇతర మౌలిక వసతుల కోసం రూ.51.75 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

**మెట్రోకు రూ.1100 కోట్లు**

మెట్రోకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1100 కోట్లను ప్రతిపాదించారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌తో పోలిస్తే తాజాగా ప్రతిపాదిత మొత్తం పెరిగింది. పాతబస్తీ మెట్రోరైలు పనులు మొదలెట్టేందుకు రూ.500 కోట్లను ప్రతిపాదించగా ఇప్పుడు విస్తరణకు మరో రూ.500 కోట్లు, విమానాశ్రయ మెట్రో ప్రాజెక్టుకు మరో రూ.100 కోట్లను ప్రతిపాదించారు. మొత్తం రూ.1100 కోట్లలో రూ.500 కోట్లు రుణంగా, రూ.600 కోట్లు గ్రాంట్లుగా బడ్జెట్ పద్దుల్లో చూపించారు.

**హెచ్ఎండీఏకు రూ. 500 కోట్లు పాతబస్తీ ఇక మొదలెట్టవచ్చు..**

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ మెట్రో విస్తరణ పనులను సీఎం రేవంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు. రూ.2 వేల కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈసారి బడ్జెట్‌లో పాతబస్తీ మెట్రో కోసం ప్రతిపాదించిన రూ.500 కోట్లలో కేటాయింపులు జరిగితే భూసేకరణ, రహదారుల విస్తరణ చేపట్టి పనులు మొదలుపెట్టడానికి అవకాశం ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో అప్పటి సర్కారు రూ.2,427.35 కోట్లను ప్రతిపాదించినా రూపాయి కూడా విడుదల చేయలేదు.గత పదేళ్లలో ఎప్పుడూ లేని రీతిలో.. హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లను బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. హెచ్ఎండీఏ ఏడు జిల్లాల పరిధిలో 7200 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. వీటి పరిధిలో కొత్తగా 22 పెద్ద పార్కులు. అవుటర్ వరకు రేడియల్ రోడ్లు, లింకు రోడ్లు నిర్మాణానికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 3700 చెరువులుండగా, కొన్నింటి సుందరీకరణకు గతంలో నిర్ణయించారు. 20 చెరువులకు ప్రతిపాదనలు చేశారు. నిధుల కొరతతో ఆ పనులు ముందుకు సాగలేదు. ఇటీవల మరో 20 చెరువుల సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తాజాగా బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఇందుకు ఉపయోగపడతాయి. అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి తీసుకున్న రుణానికి సంబంధించి యాన్యుటీ చెల్లింపు కోసం మరో రూ.200 కోట్లు కేటాయించారు. లేఅవుట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణానికి ఈ నిధులు కేటాయించే వెసులుబాటు కలగనుంది.

# పాపం.. పసివాళ్లు!

హైదరాబాద్ : ఖైరతాబాద్ కూడలి వద్ద చేతికట్టుతో చిన్నారిని ఒళ్లో ఉంచుకొని దానం చేయమంటూ ఓ మహిళ అభ్యర్థన. గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ అక్కడికెళ్లేలోపు మాయమైంది. మాసబ్‌ట్యాంక్ పైవంతెన సమీపంలోని డివైడర్‌పై రోజుల వయసున్న పసికూన. ఆ చిన్నారి ఏడుపును సొమ్ము చేసుకునేందుకు కాచుకున్న ఇద్దరు మహిళలు. గమనించిన వాహనదారుడు ఆ పిల్లాడి గురించి ఆరా తీసే ప్రయత్నం చేయబోతే.. దూరంగా ఉన్న ఆగంతుకుడు వచ్చి ఆ వ్యక్తిని బెదిరించాడు.

మహానగరంలో ట్రాఫిక్ కూడళ్లు, పర్యాటక ప్రాంతాలు, ప్రార్థన మందిరాల సమీపంలో ఇటువంటి దృశ్యాలు కనిపిస్తుంటాయి. నవజాత శిశువుల నుంచి 10-12 ఏళ్ల వయసున్న చిన్నారుల వరకూ కాసులు కురిపించే వస్తువులుగా మారారు. వీరంతా ఎవరు?.. ఎక్కడి నుంచి తీసుకొచ్చారు?.. వారి పిల్లలేనా?.. అంటూ ప్రశ్నించే నాథుడే కరవయ్యారు. కళ్లెదుట ఇటువంటి దారుణాలు కనిపిస్తున్నా ఇది మా బాధ్యత కాదంటూ పోలీసు యంత్రాంగం చేతులెత్తేస్తోంది. చెరలో చిక్కిన బాల్యాన్ని సంరక్షించాల్సిన మహిళా-శిశు సంక్షేమ విభాగం చూసీచూడనట్లు వదిలేస్తోంది. అప్పుడప్పుడు స్వచ్ఛంద సంస్థలు చేపట్టే కార్యక్రమాల్లో బాలకార్మికులను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నారు. కాస్త చొరవ తీసుకొని తల్లిదండ్రుల చెంతకు చేర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ చేసిన సర్వేలో 10 వేల



మంది బాలకార్మికులున్నారు.

మాయదారి ముఠాలు

నగరం కేంద్రంగా యూపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాలకు చెందిన ముఠాలు పిల్లల క్రయ విక్రయాలు సాగిస్తున్నాయి. బస్తీలు, శివారు ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లోకి చేరిన దళారులు గాజుల పరిశ్రమ, ఇటుకబట్టీలు, భిక్షాటన, సంపన్నులు, ఉద్యోగుల నివాసాల్లో పని చేసేందుకు 10-15 ఏళ్ల బాలబాలికలను ఎంపిక చేస్తారు. కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులకు ఏటా రూ.30,000-90,000 వరకూ ఇస్తామని ఆశ చూపుతారు. ముందస్తు అడ్వాన్స్ చెల్లించి వారిని పనిచేయాల్సిన చోట అప్పగిస్తారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఏపీ నుంచి తీసుకొచ్చిన పిల్లలను తెలంగాణలోని ఏజెంట్లకు అప్పగిస్తారు. ఇక్కడ నుంచి కొనుగోలు చేసిన పిల్లలను ముంబయి, బెంగళూరు, తమిళనాడు తదితర ప్రాంతాలకు తరలిస్తారు. కన్నవారు తమ బిడ్డలను చూసినా గుర్తుపట్టలేనంతగా మార్చేస్తారని నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తెలిపారు. చిరిగిన దుస్తులు, ఒంటిపై గాయాలు, బోడిగుండు కొట్టించి వికారంగా తయారుచేస్తారని వివరించారు. కమీషన్‌కు ఆశపడిన కొందరు రౌడీషీటర్లు తామే కొందరు పసికూనలు, వృద్ధులను సమీకరించి భిక్షాటన చేయిస్తున్నట్లు గుర్తించామని ఓ పోలీసు అధికారి తెలిపారు. కొన్నిముఠాలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, గచ్చిబౌలి, జేబీఎస్, దేవాలయాల వద్ద ఉదయాన్నే తీసుకొచ్చి యాచకులుగా వదిలేస్తుంటారు.

# తగ్గిన గృహజ్యోతి లబ్ధిదారులు

జగిత్యాల : కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం 'గృహజ్యోతి' ఈ ఏడాది అమల్లోకి తెచ్చింది. బిల్లులు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందుతుంది. అయితే ఏప్రిల్, మే నెలలో చాలా మంది లబ్ధిదారులు 200 యూనిట్లు దాటి వాడడంతో బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో గతేడాది డిసెంబర్‌లో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా



2,55,031 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 3,50,470 గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉండగా ఇందులో తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే గృహజ్యోతి పథకం అమలు చేయటంతో మొదటి నెల 1,70,045 బిల్లింగ్ చేయగా జిల్లా వ్యాప్తంగా రూ.4.93 కోట్లు లబ్ధి పొందారు. చాలా మంది గృహ జ్యోతికి మళ్లీ దరఖాస్తు చేసుకోగా ఉచిత విద్యుత్తు అందిస్తున్నారు. ఏప్రిల్, మేలో వేసవి కావటంతో కూలర్లు, ఫ్యాన్లు 24 గంటలు వాడడంతో చాలా మందికి బిల్లులు అధికంగా వచ్చాయి. 200 యూనిట్ల లోపు వాడుకుంటేనే గృహ జ్యోతి పథకానికి అర్హులు అవుతారని అధికారులు తెలిపారు. మే నెలలో బిల్లింగ్‌ను పరిశీలిస్తే 3,50,470 కనెక్షన్లకు గాను జగిత్యాల డివిజన్ పరిధిలో 2,08,651 గృహ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 1,11,049 మంది లబ్ధిదారులుగా తేలారు. జగిత్యాల డివిజన్‌లో రూ.4.11 కోట్ల మేర లబ్ధి పొందారు. మెట్‌పల్లి డివిజన్‌లో 1,41,819 గృహ కనెక్షన్లు ఉండగా 69,527 మంది రూ.2.66 కోట్ల మేర లబ్ధి పొందారు.

# వ్యాధుల కాలం.. జర పైలం



వికారాబాద్ : వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు మొదలవుతాయి. వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు, వంటివి పెరిగితే, అపరిశుభ్రత కారణంగా క్రిమి, కీటకాలు, దోమలు, వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు సోకుతాయి. కాబట్టి ప్రభుత్వ యంత్రాంగంతోపాటు ప్రజలు కూడా తమవంతుగా అప్రమత్తంగా ఉండాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షాకాలంలో విషజ్వరాలకు అడ్డకట్ట వేయడానికి వైద్య శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. దీనికి సంబంధించి అందిస్తున్న కథనం.

వీటిపై ప్రత్యేక దృష్టి

డెంగీ వ్యాధి కారక దోమ సాధారణంగా నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందుతుంది. పాత టైర్లలో, వాడి పడేసిన కొబ్బరి చిప్పలు, పాత కుండలు, పాత ఇనుప సామగ్రిలో డెంగీ లార్వాలు వృద్ధి చెందుతాయి. వీటిని తొలగించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది పురపాలక సిబ్బంది వార్డుల్లో పర్యటించి ప్రజలకు తెలియజేస్తారు. మురికినీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఫాంగింగ్ చేస్తారు.

అనధికారిక లెక్కల్లో ఎక్కువ కేసులు

పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా జిల్లాలో అక్కడక్కడా డెంగీ కేసులు వెలుగు చూస్తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 2022-23లో జిల్లాలో 46 డెంగీ కేసులు బయటపడ్డాయి. 2023-24లో 5 కేసులు బయటపడ్డాయి. అయితే అనధికార లెక్కల ప్రకారం ఏటా 60 నుంచి 100 వరకు డెంగీతో ఇబ్బంది పడుతున్న వారుంటున్నారు. చాలా వరకు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఇదీ అమలుచేసే ప్రణాళిక

24 గంటలు అందుబాటులో ఉండే జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు. దీని ద్వారా తగిన సమాచారం, సలహాలు అందిస్తారు.

ప్రోగ్రాం అధికారులతో పాటు నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లను నియమించి కాలాంతపు వ్యాధులను పర్యవేక్షిస్తారు.

మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తారు.

వ్యాధులు త్వరగా ప్రబలే హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటారు.

క్షేత్ర స్థాయిలో రాపిడ్ బృందాలను ఏర్పాటు చేసి ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై సర్వే నిర్వహిస్తారు.

టీ హబ్ కేంద్రంలో మలేరియా పరీక్ష కిట్‌లను అందుబాటులో ఉంచుతారు.

అన్ని ప్రాథమిక కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచేలా చూస్తారు.

ప్రతి శుక్రవారం కాకుండా హైరిస్క్ కేంద్రాల్లో ప్రతి రోజు డ్రై డే నిర్వహిస్తారు.

వైద్య శాఖ సిబ్బందికి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పిస్తారు.

జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ పురపాలికలతో పాటు గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రాపిడ్ యాక్షన్ బృందాలను ఏర్పాటు చేస్తారు.

సబ్ యూనిట్ అధికారులు

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలైన పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్‌లలో నలుగురు సబ్ యూనిట్ అధికారులను ప్రత్యేకంగా వ్యాధుల పరిశీలనకు నియమించారు. వీరు వ్యాధుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి సంపూర్ణ నివేదిక తయారు చేస్తారు. దీనిని ఉన్నతాధికారులకు అందజేసి పరిష్కార మార్గాలు సూచించాలని, చర్యలు తీసుకోవాలని కోరతారు.

పల్లెలు, పట్టణాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారు

వానాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నాం. రోగులకు సత్వర సేవలందించడం, క్షేత్ర స్థాయి పరిస్థితిని అంచనా వేసేందుకు నిత్యం పల్లెలు, పట్టణాల్లో ఆరోగ్య సిబ్బంది సర్వే చేస్తారు. అందుబాటులో ఉంటారు. డెంగీ నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. డెంగీ వ్యాధి ఉన్నట్లు గుర్తిస్తే ఆ పరిసరాల్లో ఉన్న 50 ఇళ్ల కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహిస్తాం. డాక్టర్ రవీందర్ యాదవ్, వ్యాధుల నివారణ కార్యక్రమ అధికారి, వికారాబాద్.

# ఐటీ కారిడార్‌లో రూ.500 కోట్ల భూమి స్వాహాకు స్కెచ్




హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ మణికొండ సమీపంలో రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ఇద్దరు రియల్టర్లు సహా పదిమంది వేసిన మాస్టర్ ప్లాన్‌ను రెవెన్యూ, పోలీసు అధికారులు ఛేదించారు. రంగారెడ్డి జిల్లా ధరణి పోర్టల్‌లో పనిచేస్తున్న దీపావత్ శ్రీనివాస్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. భూముల అక్రమ మార్పిడికి సంబంధించిన ఫైళ్లపై అప్పటి కలెక్టర్లు ఎస్.హరీష్, భారతి హొళికేరిలను వేర్వేరు తేదీల్లో దీపావత్ శ్రీనివాస్, దీపావత్ నరేష్‌లు మభ్యపెట్టి ఆమోదముద్రలు వేయించారని గుర్తించారు. మణికొండ సమీపంలోని పోకల్‌వాడ గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ భూమిని పూస రవీందర్, పూస ప్రహ్లాద్‌లు ఆక్రమించేందుకు యత్నించారని గండిపేట తహసీల్దార్ ఎన్.శ్రీనివాస్ రెడ్డి సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీపావత్ శ్రీనివాస్, సోంపల్లి మోహన్‌బాబు, కుక్కల శివరామ్‌కుమార్, డి.అంజనేయులును అరెస్టు చేశారు. ధరణి ఆపరేటర్ దీపావత్ నరేష్ నాయక్ పరారీలో ఉన్నాడని, అతడితోపాటు మరో ఐదుగురి కోసం గాలిస్తున్నామని పోలీసులు వివరించారు.

రూ.10 కోట్ల ఆఫర్.. రూ.కోటి అడ్వాన్స్ : పోకల్‌వాడలో హెచ్ఎండీఏ, ప్రైవేటు భూముల మధ్య ఉన్న రూ.500 కోట్ల విలువైన అయిదు ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేయడానికి రియల్టర్లు రవీందర్ యాదవ్, రాఘవేందర్‌రెడ్డి మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. స్థానికంగా ఉండే పూస ప్రహ్లాద్, పూస రవీందర్‌లను కలిసి.. 'మీ పేరుమీద నకిలీ పత్రాలు సృష్టిస్తాం.. భూములు చేజిక్కిన తర్వాత రూ.కోట్లలో డబ్బులిస్తామ'ంటూ వారిని ఒప్పించారు. అనంతరం నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో ఉంటున్న స్థిరాస్తి వ్యాపారులు మోహన్‌బాబు, శివరామ్‌కుమార్‌లను సంప్రదించి ఈ వ్యవహారంలో భాగస్వాములుగా చేసుకున్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ధరణి పోర్టల్‌లో పనిచేస్తున్న దీపావత్ నరేష్, దీపావత్ శ్రీనివాస్‌లను కలుసుకున్నారు. నకిలీ పత్రాల ఆధారంగా ఈ-పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని నరేష్, శ్రీనివాస్‌లను ఒప్పించారు. ఇందుకు రూ.10 కోట్లు ఇస్తామని, అడ్వాన్సుగా రూ.కోటి ఇస్తామని నరేష్, శ్రీనివాస్‌లకు ఆశచూపారు. తొలుత గతేడాది జులైలో దీపావత్ శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు ఇచ్చారు.

కలెక్టర్లను ఏమార్చి..: మీ సేవ ద్వారా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు గతేడాది సెప్టెంబరులో పూస ప్రహ్లాద్ పేరుతో ఒకటి, నవంబరులో పూస రవీందర్ పేరుతో మరో దరఖాస్తు చేయించారు. కలెక్టర్లుగా సెప్టెంబరులో హరీష్, నవంబరులో భారతి హొళికేరి ఉన్నారు. దీపావత్ నరేష్ వీరిద్దరినీ వేర్వేరు సందర్భాల్లో ఏమార్చి.. రెండు దరఖాస్తులపైనా ఆమోదముద్రలు వేయించారు. ఇలా ప్రహ్లాద్ పేరుతో 2.20 ఎకరాలు, రవీందర్ పేరుతో 2.20 ఎకరాలను పట్టాభూమిగా ధరణి పోర్టల్‌లో మార్చారు.

# అభివృద్ధికి చతుర్ముఖ వ్యూహం

సొంత మ్యానిఫెస్టో..అభివృద్ధికి పక్కావ్యూహం..అధిష్ఠానంతో చొరవ...ఇదీ రాజధానిలో గెలిచిన ఎంపీల స్థితి..వీళ్లు ఈ ఐదేళ్ల కాలంలో కొంచెం దృష్టి పెట్టినా..వారి నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోవడం పెద్ద సమస్య కాదు. రోజూ కోటి మందికి సేవలందిస్తున్న జీహెచ్ఎంసీకి అండగా నిలిస్తే..శివారు ప్రాంతాలను, గ్రామీణ ప్రాంతాలను రాజధానితో అనుసంధానం చేసే ప్రణాళికలతో ముందుకు వెళితే మెరుగైన వసతుల కల్పన అసాధ్యమేమీ కాదు.

ఇలా చేస్తే.. సమస్యలు తీరిపోవా సైనికాధికారులు తరచుగా రోడ్లను మూసేస్తుండటంతో కంటోన్మెంట్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీనిపై రక్షణశాఖ సుముఖత వ్యక్తం చేసింది. ఎంపీలు రక్షణశాఖతో సంప్రదింపులు జరిపితే సమస్య పరిష్కారమవుతుంది.పారడైజ్ కూడలి నుంచి కండ్లకోయ వరకు, జేబీఎస్ నుంచి తూముకుంట వరకు హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తోంది. వీటికి కంటోన్మెంట్ భూములు అవసరం. వాటిని అప్పగించేందుకు ఇప్పటికే రక్షణశాఖ అంగీకారం తెలిపింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మాణమవుతోన్న ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్)ని నగరంతో అనుసంధానం చేసే విషయమై కేంద్రం నుంచి ఆర్థిక సాయం పొందడం, కొత్త పైవంతెనలు,ఎలివేటెడ్ కారిడార్లకు నిధులను కోరడం, పీఎం ఆవాస్ యోజన పథకాలను తీసుకొస్తే ఎక్కువమందికి ప్రయోజనం కలుగుతుంది.మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో పదుల కిలోమీటర్ల మేర రైల్వే లైన్లు ఉన్నాయి. దాదాపు 50చోట్ల కొత్తగా ఆర్‌యూబీ, ఆర్వోబీలను నిర్మించాలని జీహెచ్ఎంసీ ప్రతిపాదించింది. రైల్వేశాఖకు లేఖ రాసింది. అక్కడి నుంచి ఆమోదం రాలేదు.గోల్నాక నుంచి రామంతాపూర్ వరకు, ఉప్పల్ కూడలి నుంచి నారపల్లి వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పైవంతెనల నిర్మాణం జరుగుతోంది. ఆరేళ్లుగా పనులు పూర్తవలేదు. ఎంపీలు చొరవ తీసుకుంటే పనులు తొందరగా అయిపోతాయి.ఇళ్ల పథకానికి నిధుల వాటాను పొందడం, మూసీ పొడవునా అభివృద్ధి పనులకు, మురుగునీటి శుద్ధి, తాగునీటి సరఫరా, స్వచ్ఛత, పౌరుల భద్రత, కాలుష్యం, ఎంఎంటీఎస్, మెట్రో రైలు విస్తరణ, ఇతర మౌలికసౌకర్యాల కల్పనకు నగర ఎంపీలు కేంద్రం సాయం తీసుకొస్తే మేలు జరుగుతుంది.

# కదులుతున్న అక్రమాల డొంక

జగిత్యాల : పురపాలికలో ప్రధాన ఆదాయ వనరైన రెవెన్యూ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి కొన్నాళ్లుగా అంతులేని అక్రమాలకు పాల్పడుతున్నాడు. మ్యుటేషన్లు, ఆస్తిపన్ను, అసెస్‌మెంట్, వీఎల్‌టీ తదితర పన్ను వసూళ్లలో అంతా తానై వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. వినియోగదారులకు పన్ను వసూలులో లబ్ధి చేకూర్చేందుకు తప్పుడు రశీదులు సృష్టించడంతోపాటు ఆన్‌లైన్‌లో సైతం సునాయాసంగా అక్రమాలకు తెరలేపాడు. ఇదే కోవలో పట్టణంలోని ఓ స్థలానికి కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి మ్యుటేషన్ చేయడంతో ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. దీనిపై ఆ భూమికి సంబంధించిన బాధితుడు కలెక్టర్, పోలీసులను ఆశ్రయించగా సదరు ఉద్యోగి అక్రమాల లీలలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీసులు ముమ్మరంగా విచారణ చేపడుతున్నారు. తాజాగా పోలీసులు రెవెన్యూ ఉద్యోగికి సంబంధించిన పూర్తి సమాచారం కోసం గురువారం పురపాలక కార్యాలయంలో ఫైళ్లను సైతం పరిశీలించినట్లు సమాచారం.ఇంటి పన్ను వసూలు తగ్గించేందుకు ఓ ధర.. అసెస్మెంట్‌కో ధర.. మ్యుటేషన్, వీఎల్‌టీ ఇలా ఏ సేవకైనా సదరు ఉద్యోగి ఇంటినే కార్యాలయంగా మలచుకుని కొందరికి సేవలందించడం గమనార్హం. రూ.వేలల్లో ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉన్న యజమానుల నుంచి డబ్బులు తీసుకుని సగం మేరకు మాఫీ చేస్తానంటూ ఆన్‌లైన్ ద్వారా పనిని చక్కబెట్టేవాడు. సాధారణంగా పురపాలికలో ఏ పనికోసం వెళ్లినా ఆ ఫైలు ఇన్‌వార్డుకు చేరాలి. ఆ తరువాత సంబంధిత సెక్షన్‌కు ఆపై కమిషనర్ వద్దకు చేరుతోంది. కానీ సదరు ఉద్యోగిని కలిస్తే ఇవేవీ అక్కర్లేకుండా పనిని చక్కదిద్దుతాడు. అవినీతి సొమ్మును ఏకంగా గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా కూడా సదరు ఉద్యోగి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు కొందరు కమిషనర్లు సైతం సహకరించేవారు. వివాదంలో ఉన్న స్థలాలు, అసెస్‌మెంట్లకైతే అందినకాడికి దోచుకోవడం ఆయనకు పరిపాటిగా మారింది. ఈయన అక్రమాలపై ఒక దశలో కౌన్సిలర్లంతా ఏకమై రాతపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారంటే సదరు ఉద్యోగి లీలలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా భూకబ్జా కేసులో ఉద్యోగి బండారం బయటకు రావడంతో ఆయన అక్రమాలన్నింటిపైనా పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఖజానాకు నష్టం..పట్టణంలో 2024 మార్చి 31 వరకు రూ.13.71 కోట్ల ఆస్తిపన్ను వసూలు బకాయిలు ఉన్నాయి. ఇందులో రూ.7.25 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అంటే కేవలం 52.86 శాతం వసూలయ్యాయి. బల్దియాలో పూర్తి సిబ్బంది ఉన్నప్పటికీ వసూలులో జగిత్యాల వెనుకంజలో ఉండటానికి కూడా పరోక్షంగా ఈ ఉద్యోగే కారణమని తెలుస్తోంది. పన్ను వసూళ్లు తగ్గడంతో దీని ప్రభావం నిధుల రాకపై పడనుందని సమాచారం.

సెలవులో కమిషనర్ రెవెన్యూ ఉద్యోగి అక్రమాల ఉదంతం వెలుగులోకి వచ్చిన తరువాత బల్దియాలో ఇతర ఉద్యోగుల్లోనూ వణుకు మొదలైంది. తాజాగా కమిషనర్ అనిల్‌బాబు సెలవుపెట్టి వెళ్లడం చర్చనీయాంశమైంది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కమిషనర్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన ఫోన్‌సైతం స్విచ్ఛాఫ్ చేశారు. రెవెన్యూ ఉద్యోగి అక్రమాలతోపాటు కార్యాలయంలో ఇతర వ్యవహారాలపై ఎక్కడ స్పందించాల్సి వస్తుందోననే సెలవుపై వెళ్లినట్లు చర్చ జరుగుతోంది.

# వరద ముప్పు తప్పదా..!

చేర్యాల : వర్షాకాలం మొదలు కావడంతో ఈసారి కూడా ముంపు బాధలు తప్పవేమోనని చేర్యాల, హుస్నాబాద్ పట్టణ వాసుల్లో మొదలైంది. ప్రతీ ఏటా సమస్య ఉత్పన్నమవుతున్నా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోందని వాపోతున్నారు.

చేర్యాలలో రహదారి విస్తరణతో..

దుద్దెడ క్రాస్‌రోడ్డు నుంచి చేర్యాల మీదుగా జనగామ వరకు ఉన్న 365బీ జాతీయ రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయి. గతేడాది ఏప్రిల్‌లో మొదలు పెట్టిన పనులు నేటికీ ముగింపు దశకు చేరుకోలేదు. పైగా పట్టణంలోనే నత్తనడకన కొనసాగుతున్నాయి. ముందుగా రోడ్డుకు ఇరువైపులా మురుగుకాలువ పనులు పూర్తి చేసి వెంటనే విద్యుత్తు స్తంభాలు, మంచినీటి పైపులైన్ల పనులు పూర్తి చేసిన తర్వాత రహదారి పనులు చేస్తే ఏ సమస్య ఉండేది కాదు. అలా కాకుండా ఓ వైపు కాలువ, మరోవైపు తాగునీటి పైపులైన్లు, ఇంకోవైపు రహదారి పనులు చేస్తుండటంతో అన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఇవే కాకుండా విద్యుత్తు స్తంభాలు సగానికిపైగా రహదారిపై, మురుగుకాలవల మధ్యలోనే వదిలేశారు. పట్టణ పరిధిలోని సుమారు నాలుగు కిలోమీటర్లు సైడ్ కాలువ పనులు చేపట్టారు. ఇవి మధ్యలోనే నిలిపేశారు. దీంతో మురుగునీరు సాఫీగా వెళ్లిపోవడం లేదు. ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే మురుగుకాలువల్లోని నీరు రహదారిపై ఏరులై పారడంతో పాటు దుకాణాలు, నివాసాల్లోకి చేరే ప్రమాదముంది. యుద్ధప్రాతిపదికన మురుగు కాలువలకు అడ్డంకిగా ఉన్న స్తంభాలను, కాలువల్లోని మట్టిని తొలగిస్తే కొంతమేర ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

హుస్నాబాద్‌లో సమస్య తీవ్రం

హుస్నాబాద్‌లో గత కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరదనీటి కారణంగా పట్టణ ప్రజలు అతలాకుతలం అయ్యారు. కొత్తగా చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలో రహదారికి



ఇరువైపులా కాలువలకు దాదాపు 15 అడుగులకుపైగా వెడల్పుతో కందకాలు తీశారు. సిద్దిపేట రోడ్ అనభేరి విగ్రహం వద్ద నుంచి బస్‌స్టేషన్ వరకు ఒకవైపు, మల్లెచెట్టు చౌరస్తా వరకు మరోవైపు కందకాలు తీశారు. కొంత భాగం కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

పూర్తిగా జలమయం.. ఈ నెల 2న సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి, బస్‌స్టేషన్ మల్లెచెట్టు చౌరస్తా నుంచి సిద్దిపేట రోడ్ వరకు జలయమం అయింది. ఈ రహదారి అనుకుని ఉన్న వీధుల్లోకి సైతం వరదనీరు ప్రవహించింది. పలు దుకాణాలు, ఇళ్లలోకి నీరు చేరి వస్తువులు తడిసిపోయాయి. అదే రాత్రి పుర సిబ్బందితో జలమయమైన ప్రాంతాల నుంచి నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయించారు. ఇకనైనా ఎన్‌హెచ్ అధికారులు కాలువల నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలని కోరుతున్నారు.

తక్షణమే కాలువ పనులు చేపడతాం

ఎన్నికల సమయంలో కోతలు వద్దని ప్రభుత్వ ఆదేశాలతో కాలువల్లో అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించలేకపోయాం. ఇక యుద్ధప్రాతిపదికన పనులు మొదలు పెడతాం. వారం రోజుల్లో పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తాం.రాజారాం, డీఈఈ, జాతీయ రహదారుల శాఖ




## శ్రీశైలం ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత.. పర్యాటకుల సందడి!

శ్రీశైలం: భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో అధికారులు మూడు గేట్లను 10 అడుగుల మేర గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 878.40 అడుగులు ఉంది.

శ్రీశైలం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 179.89 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. వరద ప్రవాహం భారీగా వస్తుండటంతో మూడు గేట్లను ఎత్తిన కర్నూలు చీఫ్ ఇంజినీర్ కబీర్ బాషా.. ఒక్కో గేటు నుంచి 27వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

6, 7, 8 గేట్లను ఎత్తడం ద్వారా మొత్తంగా 81వేల క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదలైంది. కృష్ణమ్మ పరవళ్లు తొక్కడాన్ని వీక్షించేందుకు సందర్శకులు తరలివస్తున్నారు.

## జగన్.. అహంకారమే మీ పతనానికి కారణం: షర్మిల



అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ మూర?త్వానికి ఆయన్ను మ్యూజియంలో పెట్టాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. అసెంబ్లీకి వచ్చి చంద్రబాబును నిలదీయాలని చెబితే.. ఆయనకు కొమ్ముకాసినట్లుందా?అని ప్రశ్నించారు. జగన్ అద్దంలో చూసుకుంటే ఇప్పుడు కూడా ఆయనకు చంద్రబాబే కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా జగన్‌పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. "సామాజిక మాధ్యమాల్లో నన్ను కించపరిచేంత ద్వేషం ఉంది. మాకు అలాంటి ద్వేషం లేదుగానీ, తప్పును తప్పు అని చెప్పే ధైర్యం ఉంది. ఒక ప్రతిపక్షం మరో ప్రతిపక్షాన్ని ప్రశ్నించకూడదని ఎక్కడైనా ఉందా? తప్పు చేస్తే ఏ పార్టీనైనా ప్రశ్నించే అధికారం మాకుంది. జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి వెళ్లకపోవడం తప్పు. కాబట్టే.. తప్పు అని కచ్చితంగా చెప్పాం. చట్ట సభను గౌరవించకపోవడం తప్పు. అందుకే రాజీనామా చేయాలన్నాం. వైఎస్ఆర్ విగ్రహాలను కూల్చేస్తే.. స్వయంగా అక్కడికి వెళ్లి, ధర్నా చేస్తానని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలను హెచ్చరించింది నేనే. అసలు మీరు అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ విగ్రహాలను కూల్చకుండా ఉంటే.. ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ యూనివర్సిటీ పేరు మార్చకపోయి ఉంటే.. ఈరోజు వైఎస్ఆర్‌కు ఇంత అవమానం జరిగి ఉండేది కాదు. వైకాపాలో వైఎస్ఆర్‌ని, విజయమ్మను అవమానించిన వాళ్లే పెద్దవాళ్లు కదా. అసెంబ్లీలో పోరాడటం మీకు చేతకాదు. మీకు మీడియా పాయింటే ఎక్కువ. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ చేసినందుకు గర్వపడుతున్నాం. మీరు అధికారంలో ఉన్నప్పుడు రైతులను నిలువునా మోసం చేయడం నిజం కాదా? రూ.3 వేల కోట్లతో ప్రతి ఏడాది ధరల స్థిరీకరణ నిధి అన్నారు. రూ.4 వేల కోట్లతో ప్రతి ఏడాది పంట నష్ట పరిహారం అన్నారు. వైఎస్ఆర్ జలయజ్ఞం పథకానికి తూట్లు పొడిచారు. మద్యపాన నిషేధం అని దగా చేశారు. మీ కంటే మోసగాళ్లు.. విశ్వసనీయత కోల్పోయిన వాళ్లు ఉంటారా? మీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం.. భాజపాతో అక్రమ సంబంధం పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను భాజపాకు తాకట్టుపెట్టారు. మీ అహంకారమే మీ పతనానికి కారణం" అంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## ఏపీలో పథకాల మార్పుపై ఎంపీ పురందేశ్వరి ఏమన్నారంటే?



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలోని ప్రభుత్వ పథకాల పేరు మార్పుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. భావితరాలకు ఆదర్శనీయులైన శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో పథకాలు అమలు చేయడం అభినందనీయమని కొనియాడారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు పురందేశ్వరి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పథకం కింద యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్స్ ఇస్తుంటారు. అయితే ఈ పథకాన్ని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో అమలు చేయడం మంచి సంప్రదాయానికి పునాదిగా పురందేశ్వరి చెప్పారు. సర్వేపల్లి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడని ఆమె కొనియాడారు. ఆంధ్రా విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా పని చేశారని, భారత తొలి ఉపరాష్ట్రపతిగా, 2వ రాష్ట్రపతిగా సమర్థవంతంగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేశారు. ఆయన జీవితం రేపటి పౌరులకు మార్గనిర్దేశం చేస్తుందని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరు విద్యావ్యవస్థలోని పథకానికి పెట్టడం మంచి పరిణామం అని అన్నారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా పేరు మార్చడాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నట్లు ఎంపీ పురందేశ్వరి చెప్పారు. ఏ సమయంలో ఆమె ఇంటికి వెళ్లినా కడుపు నిండా అన్నంపెట్టి ఆకలి తీర్చిన దానశీలి డొక్కా సీతమ్మ అని ఎంపీ కొనియాడారు. డొక్కా సీతమ్మ దయాగుణం, సేవాభావం విద్యార్థులకు తెలిసేలా చేయడం అభినందనీయం అని అన్నారు. పేదల ఆకలి తీర్చే పథకానికి ఆ మహనీయురాలి పేరు పెట్టడం హర్షించదగ్గ విషయం అని చెప్పారు. జగనన్న ఆణిముత్యాలు పథకాన్ని భారతదేశపు మిస్సైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి దివంగత డా.అబ్దుల్ కలాం పేరుతో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు హర్షించారు. పేద కుటుంబంలో పుట్టిన కలాం జీవన ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిని కలిగిస్తుందని ఆమె చెప్పారు. మరోవైపు జగనన్న అమ్మఒడిని తల్లికి వందనంగా, మన బడి నాడ-నేడుని మన బడి- మన భవిష్యత్తుగా మార్చారు. అలాగే స్వేచ్ఛ పథకాన్ని బాలిక రక్షగా మార్చడంపైనా ఆమె హర్షం వ్యక్తం చేశారు. మహనీయుల పేర్లతో పథకాలు అమలు చేయడం ద్వారా వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకుంటారని ఎంపీ పురందేశ్వరి అన్నారు.

## అమరావతికి కేంద్రం ఇచ్చే రూ.15వేల కోట్లు గ్రాంట్‌గా మార్చాలి..



అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన రూ.15వేల కోట్లను గ్రాంట్‌గా మార్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అమరావతికి ప్రపంచ బ్యాంకు ద్వారా రూ.15వేల కోట్లు ఇప్పించినట్లు కేంద్రం ప్రభుత్వ పెద్దలు చెప్తున్నారని, ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకొనే శక్తి చంద్రబాబుకు ఉందని ఆయన తెలిపారు. 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, ఏపీజే అబ్దుల్‌కలాం పేర్లతో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలుచేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని రామకృష్ణ పేర్కొన్నారు.

**పథకాల మార్పుపై హర్షం..** గతంలో జగనన్న విద్యాకానుక కింద పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్స్ ఇచ్చేవారు. ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకానికి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు పెట్టడం మంచి విషయం అని రామకృష్ణ అన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు, జగనన్న ఆణిముత్యాలు పథకాన్ని అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారంగా మార్చడం అభినందనీయమని ఆయన అన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ పేరిట ఉన్న పథకాలను గత వైసీపీ ప్రభుత్వం మార్చడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఆ పథకం పేరును కూడా తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

**సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాల్సిందే..** రాష్ట్రంలో ప్రస్తుత స్థితిపై శ్వేతపత్రాలు విడుదల చేసినప్పుడు అందులో వాస్తవాలు ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఏపీ ఆర్థిక వనరులు, తక్షణ పరిస్థితిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బంగాళాఖాతంలో అల్పపీడనం సందర్భంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్ర అవస్థలు పడ్డ బాధితులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల వల్లే కూటమి నేడు అధికారంలోకి వచ్చినట్లు ఆయన చెప్పారు. హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు తప్పకుండా అమలు చేయాల్సిందే అని రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్రంలో చక్రం తిప్పుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అంశాల విషయంలో ప్రధాని మోడీపై ఒత్తిడి తేవాలని రామకృష్ణ అన్నారు. శ్రీశైలం, తుంగభద్ర డ్యాంలు నిండాయని, గోదావరి పరవళ్లు తొక్కుతోందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా హంద్రీనీవా ద్వారా నీళ్లు పంప్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 31న రాయలసీమ కరవు పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

## అమాయకుడైన జగన్‌కు న్యాయం చేయండి: నాగబాబు వ్యంగ్యాస్త్రాలు

అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్‌పై సామాజిక మాధ్యమాల్లో జనసేన నేత నాగబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్‌కు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఎద్దేవా చేశారు. "ఎందుకంటే 2019లో శ్రీను అనే వ్యక్తి ఆయన మీద కోడికత్తితో దాడి చేశాడు. 5 ఏళ్లు అయినా ఆ కేసు ఇంకా కొలిక్కి రాలేదు. అప్పుడంటే జగన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ వల్ల ఆయనకు కుదర్లేదు. ఇపుడు ఖాళీగానే ఉన్నారు. కాబట్టి కూటమి ప్రభుత్వం ఆయనకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ఆయన మీద హత్యాయత్నం చేసిన నేరస్థుడికి సరైన శిక్ష విధించాలి కదా!. కేసును తక్షణమే విచారించి అమాయకుడు అయిన జగన్‌కు న్యాయం చేయాల్సిందిగా కూటమి ప్రభుత్వాన్ని, సీఎంను, డిప్యూటీ సీఎంను, హోం మంత్రిని కోరుతున్నా" అని నాగబాబు తెలిపారు.




## బీజేపీ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలను వెన్నుపోటు పొడిచింది.. రాహుల్ గాంధీ ధ్వజం

లోక్‌సభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తారాస్థాయిలో విరుచుకుపడ్డారు. 2024 బడ్జెట్ మధ్య తరగతి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. "బీజేపీ ప్రభుత్వం మధ్యతరగతికి ద్రోహం చేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాలను తొలగించి, మధ్యతరగతి ప్రజలను వెన్నుపోటు పొడిచింది" అని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం ఆధునిక చక్రవ్యూహాన్ని నిర్మించిందని.. అందులో రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి వారు, సమాజంలోని ఇతర వర్గాలు చిక్కుకొని ఉన్నారన్నారు. దీర్ఘకాలిక లాభాలపై పన్ను విధించడంతో.. మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ట్యాక్స్ టెర్రరిజం :** రాహుల్ గాంధీ ఇంకా మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాలను బీజేపీ భయపెడుతోందని ఆరోపించారు. కేంద్రమంత్రులతో పాటు నేతలు సైతం భయపెడుతున్నారని.. దేశవ్యాప్తంగా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయని ధ్వజమెత్తారు. ట్యాక్స్ టెర్రరిజంతో వ్యవస్థ ఆగమవుతోందని అన్నారు. పలు రకాల ట్యాక్సుల పేర్లతో ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు. పద్మవ్యూహం కమలం ఆకారంలో ఉంటుందని.. బీజేపీ గుర్తుని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యానించారు. పద్మవ్యూహం లాంటి కమలం పార్టీ దేశంలో అధికారంలో ఉందని, అందుకే రైతులు భయపడుతున్నారని అన్నారు. మహాభారతంలో పద్మవ్యూహాన్ని ఆరుగురు నియంత్రిస్తే.. ఇప్పుడు మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, అజిత్ దోవల్, అంబానీ, అదాని లాంటి వారు కంట్రోల్ చేస్తున్నారని నిప్పులు చెరిగారు.

**ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితి :** కేంద్రంలోని ప్రభుత్వం అదానీ, అంబానీల కోసమే ఉందంటూ రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఒకవైపు పేపర్ లీక్, మరోవైపు నిరుద్యోగ చక్రబంధంలో దేశం ఉందని.. ఇంటర్న్‌షిప్ వల్ల యువతకు ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. కాళ్లు విరగ్గొట్టి.. మీద బ్లాంకెట్ వేసినట్లు ఉందంటూ తూర్పారపట్టారు. అగ్నివీర్‌ల పెన్షన్‌కు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, మధ్యతరగతిని పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మద్దతు ధర ఇవ్వాలని రైతులు చాలాకాలం నుంచి అడుగుతున్నారని.. కానీ బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదని నిప్పులు చెరిగారు.

**బీజేపీ ఎంపీల అభ్యంతరం :** ఇదిలావుండగా.. రాహుల్ ప్రసంగిస్తున్న సమయంలో బీజేపీ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అప్పుడు స్పీకర్ ఓంబిర్లా కలగజేసుకొని అభ్యంతరం తెలిపారు. ఒకరు ప్రసంగిస్తున్నప్పుడు ఇలా అడ్డుతగలడం సబబు కాదని.. సభా మర్యాదలను పాటించాలని కోరారు.




## నరకంలో జీవిస్తున్నాం.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సివిల్స్ విద్యార్థి లేఖ

ఢిల్లీ: వరదల కారణంగా ఢిల్లీలో ముగ్గురు సివిల్స్ విద్యార్థుల మృతి సంచలంగా మారింది. నగర అధికారులు, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందంటూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారి మరణాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సివిల్స్ విద్యార్థి ఒకరు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్‌కి లేఖ రాశాడు. సివిల్స్ విద్యార్థి అవినాశ్ దూబే ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సెంటర్‌లో ఉన్న లోపాలను లేఖలో వివరించాడు. "ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతూ విద్యనభ్యసించడమనేది మా ప్రాథమిక హక్కు. నీటి ఎద్దడి, వరదల కారణంగా విద్యార్థుల భద్రతకు ముప్పు వాటిల్లితోంది. మాకు సురక్షితమైన వాతావరణం అవసరముంది. అప్పుడే నిర్భయంగా చదువుపై దృష్టి సారించగలం. దేశ అభివృద్ధిలో భాగమవ్వగలం" అని పేర్కొన్నాడు. తమతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న పేలవమైన మౌలిక సదుపాయల గురించి వెల్లడించాడు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్షాలు పడినప్పుడల్లా నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నాడు. నిబంధనలను ఉల్లంఘించి బేస్‌మెంట్‌లను లైబ్రరీలుగా మార్చారని.. వారి నిర్లక్ష్యం వల్లే ఆ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించాడు. తామంతా నరకంలో జీవిస్తున్నట్లు లేఖలో ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యార్థుల మరణాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించాడు. కాగా.. ఇటీవల ఢిల్లీలో రావూస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు ప్రవహించడంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. విద్యార్థుల ఆందోళనతో కోచింగ్ సెంటర్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

## సమయం వస్తే పెద్దిరెడ్డి అయినా.. జగనైనా చర్యలు తప్పవ్: మంత్రి అనగాని




అమరావతి: మదనపల్లె ఘటనలో ఎంతటి వారున్నా శిక్షార్హులేనని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సమయం వస్తే పెద్దిరెడ్డి అయినా.. జగనైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గతంలో కొందరు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన భూములపై సమీక్షిస్తామని.. రూ.కోట్ల విలువ చేసే భూములను లక్షల రూపాయలకే కేటాయిస్తారా? అని ప్రశ్నించారు. సోమవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ అమరావతిలోని సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. "రెవెన్యూ కార్యాలయంలోనే భద్రత లేని పరిస్థితి నెలకొంది. రెవెన్యూశాఖ కార్యదర్శి మూడు రోజులపాటు మదనపల్లెలోనే ఉన్నారు. మదనపల్లె ఘటనపై అధ్యయనం చేసి సీఎంకు నివేదిక ఇచ్చారు. మదనపల్లెలో జరిగిన అన్యాయాలపై ప్రజలు పెద్ద ఎత్తున ఫిర్యాదులు ఇచ్చారు. ముగ్గురు అధికారుల్ని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చాం" అన్నారు.

**క్యూఆర్ కోడ్‌తో కొత్త పాసు పుస్తకాలు :** "అసైన్డ్ భూముల సమస్యలపైనా రెవెన్యూశాఖ అధ్యయనం చేస్తుంది. ఎన్ని భూములు 22ఏ కింద ఉన్నాయి.. ఎన్ని తొలగించారనేది పరిశీలించాలి. వైకాపా హయాంలో భారీగా భూపందేరాలు చేశారు. వైకాపా హయాంలో ప్రవేటే వ్యక్తులకు భూములు దోచిపెట్టారు.

దోచిపెట్టిన భూముల్ని వెనక్కి తీసుకోవడంపై సమీక్ష జరిగింది. భూ సర్వే పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. భూసర్వే ఇబ్బందులను గ్రామసభల్లోనే పరిష్కరించుకోవాలి. జగన్ పేరిట 77లక్షల సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించేందుకే రూ.15కోట్లు ఖర్చవుతుంది. క్యూఆర్‌కోడ్‌తో కొత్త పాసు పుస్తకాల తయారీ జరుగుతోంది" అని మంత్రి వివరించారు.

## మదనపల్లె దస్త్రాల ఘటన.. సీఎం చేసిన సూచన అదే: డీఐజీ కోయ ప్రవీణ్



కడప: కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కర్నూలు నుంచి మదనపల్లె వెళ్తూ కడపలో ఆగారు. కడప ఎస్పీ హర్షవర్ధన్‌తో ప్రవీణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. " మదనపల్లె దస్త్రాల ఘటనపై విచారణ సాగుతోంది.

భారీ స్థాయిలో కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. రెవెన్యూ డాక్యుమెంట్లు పరిశీలించాం. కొన్ని ఆధారాలు లభించాయి. అన్ని అంశాలపై కూలంకషంగా దర్యాప్తు చేస్తున్నాం. సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజపై ప్రధాన ఆరోపణలు వచ్చాయి. ఫోరెన్సిక్ సలహాలు తీసుకోవాలని సీఎం సూచించారు. పెద్దిరెడ్డి పీఏకి చెందిన డాక్యుమెంట్లు దొరికినట్లు తెలుస్తోంది" అని డీఐజీ వెల్లడించారు.

## మంత్రి సాహసం.. స్వయంగా అక్కడికి ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్లి..



పశ్చిమ గోదావరి: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లోని గ్రామాలను వరదలు ముంచెత్తాయి. దీంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సరైన ఆహారం, మంచినీరు, విద్యుత్ సదుపాయం లేక ప్రజలు తీవ్రఅవస్థలు పడతున్నారు. పంటలు నీట మునిగి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాధితులను పరామర్శించేందుకు ఏపీ నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు నిర్ణయించుకున్నారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న పశ్చిమ గోదావరి జిల్లా వద్దిపర్రు గ్రామానికి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ ఆయన వెళ్లారు. గుమ్మలూరు- వద్దిపర్రు ప్రధాన రహదారిపై వారం రోజులుగా ఐదు అడుగుల ఎత్తున వరదనీరు చేరడంతో గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో దాదాపు రెండు కిలోమీటర్లు మేర ట్రాక్టర్ నడుపుతూ గ్రామానికి చేరుకుని బాధితులను మంత్రి నిమ్మల పరామర్శించారు. తమ బాధలు స్వయంగా చూసేందుకు మంత్రి రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. నిమ్మల వారి కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని హామీ ఇచ్చారు.

# అనసూయ.. స్టైల్ క్వీన్ అనేలా ఆ హొయలు..

టాలీవుడ్ బుల్లితెరపై తనదైన శైలి, అందంతో ప్రేక్షకులను మైమరిపిస్తున్న అందాల బొమ్మ అనసూయ భరద్వాజ్. న్యూస్ రీడర్ గా కెరీర్ ప్రారంభించిన ఈ బ్యూటీఫుల్ యాంకర్, జబర్దస్త్ కామెడీ షో ద్వారా బుల్లితెరపై యాంకర్ గా మంచి పేరు తెచ్చుకుంది. యాంకరింగ్ తోనే కాదు, నటిగా కూడా తన ప్రతిభను నిరూపించుకుంది అనసూయ. అనసూయ వెండితెరపై నటిగా అడుగుపెట్టిన కొత్తలోనే మంచి క్రేజ్ అందుకుంది. ఆమెకి మంచి పేరు తీసుకు వచ్చిన సినిమాల్లో "క్షణం" ఒకటి. ఈ చిత్రం అనసూయ నటనకు విమర్శకుల ప్రశంసలు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత "రంగస్థలం" సినిమాలో రంగమ్మత్తగా నటించి, తార స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఈ పాత్ర ద్వారా అనసూయ తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని ప్రదర్శించి, ప్రేక్షకులను ఆకట్టుకుంది. "పుష్ప" సినిమాలో కీలక పాత్రలో నటించిన అనసూయ, ఈ చిత్రం సీక్వెల్ "పుష్ప: ది రూల్" లో కూడా నటిస్తోంది. అంతేకాకుండా, అనసూయ ఇతర భాషలలో కూడా అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. అనసూయ సామాజిక మాధ్యమాలలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన ఇన్‌స్టాగ్రామ్ లో అప్డేట్స్, ఫోటోలు,



వీడియోలు షేర్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా, తన ఫ్యామిలీతో కలిసి వెకేషన్ కి సంబంధించిన ఫోటోలు పోస్ట్ చేయడం అనసూయకు అలవాటు. అనసూయ తనపై ఎవరైనా విమర్శలు చేస్తే, దానికి వెంటనే స్పందిస్తూ సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతుంది. ఈ నైజం ఆమెను అభిమానులకు మరింత దగ్గర చేస్తోంది. అంతేకాకుండా, తన గ్లామర్ ఫోటోలతో కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా అనసూయ మరోసారి తన గ్లామర్ తో ఫాలోవర్స్ కు షాక్ ఇచ్చింది. అందంగా ముస్తాబై దిగిన ఫోటోలు తన ఇన్‌స్టాగ్రామ్ లో పంచుకుంది. ఈ ఫోటోలలో అనసూయ అందం నెటిజన్లను ఆకట్టుకుంది. అనసూయ లుక్స్ అభిమానులను సర్ప్రైజ్ చేస్తున్నాయి. ఆమె అందం, అభినయం అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ కలర్ స్టైలిష్ డ్రెస్ లో గ్లామర్ క్వీన్ లా కనిపిస్తోందని ఫాలోవర్స్ పాజిటివ్ గా కామెంట్ చేస్తున్నారు. ఒక చేతిలో బ్యాగ్ పట్టుకొని వయ్యారంగా నిలబడిన తీరు మరింత ఎట్రాక్ట్ చేస్తోంది. ఆమె ఎలాంటి స్టిల్ ఇచ్చినా బ్యూటీఫుల్ అనేలా ఉంటుంది అని మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం అనసూయ "పుష్ప 2" చిత్రంతో పాటు మరో రెండు సినిమాలతో బిజీగా ఉంది. అలాగే, వెబ్ సీరీస్ లలో కూడా నటిస్తూ తన కెరీర్ ను విస్తరిస్తోంది.

# కియారా-అంబానీ కూతురు అంత క్లోజా?

బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వాణీ తెలుగు ప్రేక్షకులకు బాగా సుపరిచితమే. 'వినయ విధేయ రామ భరత్ అనే నేను చిత్రాలతో పరిచయమైన అమ్మడికి అనతి కాలంలోనే మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం గేమ్ ఛేంజర్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కి జోడీ నటిస్తోంది. ఈ సినిమా విజయం సాధిస్తే అమ్మడికి పాన్ ఇండియాలో గుర్తింపు దక్కుతుంది. ఇక కియారా బాలీవుడ్ కెరీర్ గురించైతే చెప్పాల్సిన పనిలేదు. రిచ్ కిడ్ కావడంతో సినిమాల్లోకి ఈజీగా రాగలిగింది. కానీ ట్యాలెంట్తోనే ఇండస్ట్రీలో నిలదొక్కుకుందన్నది వాస్తవం. అయితే ఈ అమ్మడికి అంబానీ కుమార్తె ఈషా అంబానీచిన్న నాటి క్లోజ్ ఫ్రెండ్ అన్న సంగతి వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని స్వయంగా ఈషా అంబానీ రివీల్ చేసింది. తన జీవితంలో కియారా ఎంతో కీలకమైన వ్యక్తిగా చెప్పుకొచ్చింది. మంచి చెప్పే వాళ్లు మాత్రమే కాదు. విమర్శించే వాళ్లు కూడా ఉండాలి.



అలా చెప్పిన వారే నిజమైన స్నేహితులు. కియారా అద్వాణీ నాకు అలాంటి స్నేహితురాలే. ఇద్దరం ముంబైలోని ధీరుబాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్లో కలిసి చదువుకున్నాం. కియారా చదువుతో పాటు ఆటల్లోనూ చురుకుగా ఉండేది. నన్ను కూడా ప్రోత్సహించేది. నచ్చని పని ఏది చేసినా వెంటనే చెప్పేది. కియారా స్కూల్ కి రాని రోజులో నాకు ఏదో కోల్పోయిన భావనలో ఉండేదాన్ని. స్కూల్లో ఎవైనా కార్యక్రమాలు జరిగితే తనని నేను ప్రత్యేకంగా రెడీ చేసే దాన్ని. చివరికి కియారాని పెళ్లి కూతుర్ని చేసింది కూడా నేను. ఇద్దరం అంత క్లోజ్ గా ఉంటాం. నా విషయంలోనూ కియారా అంతే శ్రద్ధ తీసుకుంటుంది. ఇప్పటికీ మా మధ్య అలాంటి స్నేహమే కొనసాగుతుంది. తను నాకు బెస్ట్ ఫ్రెండ్ అని తెలిపింది.




# మెకానిక్ రాకీ గ్లింప్స్.. డేంజర్ కే లైసెన్స్ వీడు!




యువ హీరో విశ్వక్ సేన్ నుంచి ఒక సినిమా వస్తోంది అంటే తప్పకుండా అందులో ఏదో ఒక న్యూ డిఫరెంట్ కాన్సెప్ట్ ఉంటుందని ఆడియెన్స్ లో నమ్మకం వచ్చేసింది. గామి సినిమాతోనే అతను నటుడిగా తానేంటో నిరూపించుకున్నాడు. ఇక రెగ్యులర్ గా ఒకే తరహాలో కాకుండా అన్ని వర్గాల ఆడియెన్స్ కు కనెక్ట్ అయ్యేలా కమర్షియల్ పాయింట్స్ ను కూడా టచ్ చేస్తున్నాడు. ఇప్పుడు విశ్వక్ నటిస్తున్న 'మెకానిక్ రాకీ' సౌండ్ మొదలైంది. ఇక చిత్రానికి సంబంధించిన గ్లింప్స్ ను ఫస్ట్ గేర్ అంటూ విడుదల చేశారు. రవితేజ ముల్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మాణంలో సారథ్యం వహిస్తున్న ఈ చిత్రంలో విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. మొదటి సారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన రవితేజ ముల్లపూడి ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఫస్ట్ గేర్ టీజర్ లో ప్రధాన పాత్రలతో పాటు ఈ చిత్రంలో ఉన్న ట్రయాంగిల్ లవ్ స్టొరీ అని రివీల్ చేశారు. విశ్వక్ సేన్ మెకానిక్ రాకీ గా కనిపించడంతో, అతని పాత్రలో ఉన్న మాస్ యాంగిల్, యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటున్నాయి. "చోటే చోటే బచ్చో కో పూరోం కీ మై జవాబ్ దేతా..." అనే డైలాగ్ తో పాటు "డేంజర్ కే లైసెన్స్" అనే బ్యాక్ గ్రౌండ్ వాయిస్ విశ్వక్ సేన్ డైనమిక్ క్యారెక్టర్ ని హైలైట్ చేస్తున్నాయి. మీనాక్షి చౌదరి ఎథ్నిక్ వేర్ లో కూల్ గా కనిపిస్తుండగా, శ్రద్ధా శ్రీనాథ్ ఒక అర్బన్ లేడీ పాత్రలో అలరిస్తున్నారు. హీరోయిన్ మీనాక్షి విశ్వక్ సేన్ మధ్యలో వచ్చిన సీన్స్ చాలా ఫన్నీగా ఉండడం విశేషం. ఇక మిగతా నటీనటుల పాత్రలు కూడా పవర్ఫుల్ గా ఉండనున్నట్లు అర్థమవుతుంది. సునీల్, నరేష్, రోడీస్ రఘురాం పాత్రలు నెవ్వర్ బిఫోర్ అనేలా ఉండనున్నట్లు తెలుస్తోంది. అవి ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి. రవితేజ ముల్లపూడి ఒక విభిన్నమైన కథతో, విశ్వక్ సేన్ క్యారెక్టర్ ను శక్తివంతంగా ప్రెజెంట్ చేయడం తన డైరెక్షన్ సత్తా చూపిస్తోంది. ఇక మనోజ్ కటసాని కెమెరా వర్క్ అద్భుతంగా ఉండగా, జేక్స్ బిజోయ్ మ్యూజిక్ ఈ సినిమాపై మరింత అంచనాలను పెంచుతుంది. ప్రొడక్షన్ డిజైన్ కూడా టాప్ క్లాస్ గా ఉంది. మొత్తం మీద ఫస్ట్ గేర్ టీజర్ ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాకు అన్వర్ అలీ ఎడిటర్ గా, క్రాంతి ప్రియమ్ ప్రొడక్షన్ డిజైనర్ గా, సత్యం రాజేష్, విద్యాసాగర్ జె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. 'మెకానిక్ రాకీ' చిత్రం దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సోలోగా బాక్సాఫీస్ ని షేక్ చేసే సత్తా మాలోనూ!



ఒకప్పుడు బాలీవుడ్ లో లేడీ ఓ రియేంటెడ్ చిత్రాలంటే చాలా తక్కువగానే కనిపించేవి. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. అక్కడా లేడీ ఓరియేంటెడ్ చిత్రాల జోరు పుంజుకుంటుంది. స్టార్ హీరోయిన్లు అంతా సోలో గానూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నారు. దీపికా పదుకొణే, కరీనా కపూర్, రాణీ ముఖర్జీ, విద్యాబాలన్, టబు లాంటి సీనియర్ భామలు మార్కెట్ లో హీరోలకు తక్కువేం కాదని నిరూపిస్తున్నారు. ఈ మధ్య నే యువ నాయిక అలియాభట్ కూడా వాళ్ల సరసన స్థానం సంపాందించిన సంగతి తెలిసిందే. గంగుబాయి కతివాడితో దేశాన్నే ఊపేసింది. అంతకు ముందు రాజీతోనూ సంచలనం సృష్టించింది. తాజాగా ఆల్ఫా అనే స్పై చిత్రంలోనూ నటిస్తోంది. ఆమెతో పాటు శార్వరీ వాఘ్ కూడా నటిస్తోంది. ఇద్దర్నీ మెయిన్ లీడ్స్ లో పెట్టి యశ్ రాజ్ ఫిలింస్ ఈ ప్రయోగం చేస్తోంది. ఇప్పటికే ఇద్దరు మార్షల్ ఆర్ట్స్ లో ట్రైనింగ్ కూడా పూర్తి చేసారు. శివ రావెల్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఇదే ఏడాది రిలీజ్ చేయనున్నారు. ఇక మిస్టరీ థ్రిల్లర్ %-%దో పత్తీ%-% లో కాజోల్, కృతిసనన్ కలిసి నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈసినిమాని కృతి సనన్ నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ కూడా పూర్తయింది. ఇదొక సైకో థ్రిల్లర్.శశాంక్ చతుర్వేది తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే సినిమా నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కానుంది. అలాగే ప్రియాంక చోప్రా, కత్రినా కైఫ్, అలియ భట్ ప్రధాన పాత్రల్లో జీలే జర పర్హాన్ అక్తర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ సినిమా ఇప్పటికే ఆలస్యమవుతోన్న నేపథ్యంలో డిలే చేయకుండా చూడాలని పర్హాన్ ముందుకు కదులు తున్నాడు. అలాగే కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీహీరామండి సీజన్ -2కి రంగం సిద్ధం చేస్తున్నారు. మొదటి సీజన్ మంచి విజయం సాధించడంతో అదే నటుల్ని కొనసాగిస్తూ..కొత్త నటీనుటుల్నీ యాడ్ చేసుకుని సీజన్-2 ప్లాన్ చేస్తున్నాడు. ఇక కీర్తి సురేష్ అక్క అనే వెబ్ సిరీస్ తో బాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ని ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.

# రాశి ఖన్నా కెరీర్ ఓకే కానీ

సౌత్ లో క్రేజీ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని సొంతం చేసుకున్న బ్యూటీ రాశిఖన్నా. ఈ అమ్మడు చేతిలో అవకాశాలు బాగానే ఉన్న స్ట్రైట్ తెలుగు మూవీలో కనిపించి చాలా కాలం అయ్యింది. చివరిగా రాశిఖన్నా నాగ చైతన్య థాంక్యూ మూవీలో నటించింది. ఈ ఏడాది అరణ్మనై 4 సినిమాతో రాశిఖన్నా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ తమిళంలో సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఏకంగా 100 కోట్లకి పైగా గ్రాస్ కలెక్ట్ చేసింది. ఆరంభంలో యావరేజ్ టాక్ వచ్చిన కూడా తరువాత మెల్లగా కలెక్షన్స్ పుంజుకున్నాయి. లాంగ్ రన్ లో ఈ చిత్రం సెంచరీ క్రాస్ చేసింది. సుందర్ సికి జోడీగా ఈ చిత్రంలో రాశిఖన్నా నటించింది. అరణ్మనై ఫ్రాంచైజ్ లో 4వ భాగంగా ఈ మూవీ వచ్చింది. తెలుగులో బాక్ టైటిల్ తో రిలీజ్ అయ్యింది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ చేతిలో ప్రస్తుతం నాలుగు సినిమాల వరకు ఉన్నాయి. వాటిలో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న తెలుసుకదా మూవీ ఒకటి. ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రంలో రాశిఖన్నా చాలా హోప్స్ పెట్టుకుంది. ఓ విధంగా టాలీవుడ్ లో రాశిఖన్నా ఫేడ్ అవుట్



అయిపోయిందనే విధంగా కామెంట్స్ వచ్చాయి. కొత్త కొత్త భామలు వస్తూ ఉండటంతో ఈమెకి అవకాశాలు తగ్గిపోయాయని కథనాలు వచ్చాయి. కాబట్టి ఆమె విమర్శలకు చెక్ పెట్టి బౌన్స్ బ్యాక్ అవ్వాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉంటే మరోసారి సుందర్ సి దర్శకత్వంలో ఆయనకి జోడీగా నటించడానికి రాశిఖన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంట. ఇప్పటికే అరణ్మనై 3, 4 పార్ట్స్ లో రాశిఖన్నా హీరోయిన్ గా చేసింది. మూడో సారి సుందరి సితో జతకడుతోంది. అయితే ఇది అరణ్మనై నెక్స్ట్ పార్ట్ కోసం కాదని తెలుస్తోంది. ఓ కొత్త కథతో సుందర్ సి హీరోగా స్వీయ దర్శకత్వంలో మూవీ చేయబోతున్నాడంట. ఈ సినిమా కోసం రాశిఖన్నాని హీరోయిన్ గా కన్ఫర్మ్ చేసారంట. రాశిఖన్నా నటించిన హిందీ సినిమాలు ది సబర్మతి రిపోర్ట్, %ఽవీజు% పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. అలాగే తమిళంలో మేథావి అనే మరో సినిమాలో కూడా ఆమె నటిస్తోంది. ఈమె తెలుగు మూవీ తెలుసుకదా ఏడాది ఆఖరులో లేదంటే వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ కావొచ్చంట. అయితే రాశిఖన్నా సినిమాల లైన్ అప్ చూసుకుంటే మేగ్జిమమ్ చిన్న హీరోలతోనే ఉన్నాయి. మరి ఈ బ్యూటీ స్టార్ హీరోలతో జత కట్టే అవకాశాన్ని మళ్ళీ అందుకుంటుందా లేదంటే ఇక కంటెంట్ బేస్డ్ కథలు, చిన్న, మీడియం రేంజ్ హీరోలతో చేసుకోవాల్సిందేనా? అనే సందేహాలు వస్తున్నాయి. మరి ఈ బ్యూటి స్టార్ హీరోలతో ఛాన్స్ లు ఇంకెప్పుడు అందుకుంటుందో చూడాలి.

# దేవియాని బికినీ డోస్.. ఇది సండే సర్ ప్రైజ్

ఢిల్లీ బ్యూటీ దేవియాని శర్మ.. టాలీవుడ్ లో తనకంటూ స్పెషల్ ఇమేజ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. రెండు వెబ్ సిరీసుల్లో నటించి ఓ రేంజ్ లో ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో కూడా వేరే లెవెల్ లో ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. తన అందచందాలతో ఆకట్టుకుంటూ కుర్రాళ్ల దృష్టి తన వైపు తిప్పుకుంటోంది. నెట్టింట ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే అమ్మడు.. తన ఫ్యాన్స్ కోసం కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తూ సందడి చేస్తుంటోంది. అటు చీరల్లో.. ఇటు బికినీల్లో అందాలు ఆరబోస్తూ మైమరపిస్తుంటోంది. ఎక్కువగా పొట్టి బట్టల్లో గ్లామర్ షో చేస్తూ ఫిదా చేస్తుంటోంది. గ్లామర్ డోస్ విషయంలో తగ్గేదేలే అంటూ స్టిల్స్ ఇస్తుంటోంది. మత్తెక్కించే ఫోజులతో కిర్రెక్కిస్తుంటోంది. డైలీ తన సోషల్ మీడియా వాల్ చూడాలనిపించేలా ట్రీట్స్ ఇస్తుంటోంది. నెట్టింట సెగలు పుట్టిస్తూ మైండ్ బ్లాక్ చేస్తుంటోంది. ఎప్పటికప్పుడు తన పిక్స్ తోనే ఫుల్ ట్రెండింగ్ లో ఉంటోంది అమ్మడు. తాజాగా సండే ట్రీట్ ఇచ్చింది దేవియాని శర్మ. ఇన్నర్ సొగసులతో క్లీన్ బౌల్డ్ చేస్తోంది బ్యూటీ. జీన్ బాటమ్ వేసుకున్న అమ్మడు.. తన ఫిజిక్ తో అలరిస్తోంది.



నడుము మడతలతో అట్రాక్ట్ చేస్తోంది. నాభి అందాలతో కుర్రాళ్ల దృష్టిని తనవైపు తిప్పుకుంటోంది. నావెల్ పిన్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తోంది. ఎద అందాలతో కవ్విస్తోంది. ఇప్పుడు దేవియాని శర్మ పిక్స్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. సండే ట్రీట్ అదిరిపోయిందని నెటిజన్లు చెబుతున్నారు. దేవియాని ఎవర్ గ్రీన్ గ్లామరస్ గర్ల్ అంటూ కొనియాడుతున్నారు. అయితే టాలీవుడ్ నటుడు నవీన్ చంద్ర భానుమతి రామకృష్ణ మూవీతో తెలుగు సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది దేవియాని శర్మ. ఆ తర్వాత పలు చిత్రాల్లో కనిపించింది. ఆకాష్ పూరి రొమాంటిక్ సినిమాలో హీరో ఫ్రెండ్ గా నటించి మెప్పించింది. సేవ్ ది టైగర్స్, సైతాన్ వెబ్ సిరీసులతో తెలుగులో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆ రెండు సిరీసుల్లో తన నటనతో ఆకట్టుకుంది అమ్మడు. ఆ సిరీసుల సీక్వెల్ సీజన్స్ లో కూడా నటిస్తోంది దేవియాని శర్మ. సేవ్ ద టైగర్స్ వెబ్ సిరీస్ లో హై ప్రొఫైల్ ఫెమినిస్ట్ లాయర్ గా నటించి మెప్పించింది. సైతాన్ వెబ్ సిరీస్ లో రఫ్ అండ్ బోల్డ్ క్యారెక్టర్ లో ఓ రేంజ్ లో యాక్ట్ చేసింది. ఇప్పుడు పెద్ద హీరోల చిత్రాల్లో అవకాశాలు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వాలని ఉందని ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. మరి దేవియాని శర్మ.. భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో వేచి చూడాలి.



# సభకు రానప్పుడు.. కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు?

హైదరాబాద్: గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని అప్పుల్లోకి నెట్టేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. అప్పుల నుంచి విద్యుత్ రంగాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సీఎంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శలు సరికాదన్నారు. "గత ప్రభుత్వ తప్పులు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. భారాస ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసింది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు అదనపు విద్యుత్‌ను యూపీఏ ప్రభుత్వం కేటాయించింది. జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్ర అవసరాల మేరకు విద్యుత్ కేటాయించారు. కేసీఆర్ సభకు వచ్చి మాట్లాడాలని కోరుతున్నాం. కేసీఆర్ సభకు ఎందుకు రావట్లేదని అడిగితే.. కేసీఆర్‌తో మాట్లాడే స్థాయి మాది కాదన్నారు. సభకు రానప్పుడు ఆయనకు ప్రతిపక్ష హోదా ఎందుకు? ప్రతిపక్ష నేత హోదా కేసీఆర్ కాకుండా వేరేవారు తీసుకోవచ్చు కదా? విద్యుత్ అవకతవకలపై కమిషన్ వేసి దర్యాప్తు చేస్తున్నాం. యాదాద్రి పవర్ ప్లాంట్ లాభదాయకం కాదని 2018లోనే చెప్పాను. ఈ ప్లాంట్ పూర్తయ్యేందుకు అదనంగా రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టాలి. డబ్బులు పోయినా యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తికాలేదు. రామగుండంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉంది. అక్కడ కాకుండా యాదాద్రిలో ఎందుకు నిర్మించారు?" అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.



# పవర్ ఫైట్

## విద్యుత్ కొనుగోళ్లపై సభలో నిప్పులు చెరిగిన సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 29: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఐదో రోజూ వాడీవేడిగా కొనసాగుతున్నాయి. శాసనసభలో విద్యుత్ రంగంపై చర్చలో భాగంగా గత బీఆర్ఎస్ సర్కార్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (%జవీ =వఝుత్ర్ష =వఎఎవ%) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం మాట్లాడుతూ..."సీఎం రేవంత్ రెడ్డి మాజీ మంత్రి ఆవేదన చూస్తుంటే.. ఆర్జేడీ చర్లపల్లి జైలులో అన్నట్లు ఉంది. ఈ సభ్యుడు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పలు అంశాలు ప్రస్తావించారు. సత్య హరిచంద్రుడి వంశంలో పుట్టాం. ఆయన తర్వాత కేసీఆర్ అన్నట్లు.. విద్యుత్ కొనుగోళ్ల మీద విచారణ అడిగారు. ప్రభుత్వం ఆమోదించింది. జస్టిస్ నర్సింహారెడ్డిని నియమించడం జరిగింది. మాజీ సీఎం, మాజీ మంత్రులను విచారణకు వచ్చి వాదనని వినిపించే ప్రయత్నం చేశారు. సుప్రీం కోర్టు కమిషన్ కొనసాగించల్సిందే అని.. చైర్మన్‌ను మార్చండి అని సూచించింది. ఇవ్వాళ సాయంత్రం విద్యుత్ కమిషన్ కొత్త చైర్మన్‌ను నియమిస్తాం" అని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ జనాభా ప్రకారం ఆస్తులు.. అప్పుల పంపకం జరిగిందన్నారు. ఛత్తీస్గఢ్, జార?ండ్ ఏర్పాటు సమయంలో ఉత్పత్తి చేసే సంస్థలు కొత్త రాష్ట్రంలో.. వినియోగం మహారాష్ట్రకు వెళ్ళడంతో తీవ్ర సంక్షోభం ఎదుర్కొందన్నారు. మాజీ సీఎం అసెంబ్లీలో కట్టే పట్టుకొని విద్యుత్ సంక్షోభం ఎదుర్కొంటుంది అని చెప్పారని గుర్తుచేశారు. జైపాల్ రెడ్డి ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా.. వినియోగం ప్రాతిపదికన విభజన జరగాలని అలా అయితే తెలంగాణ ఇబ్బంది ఉండదు అని చెప్పారన్నారు. విభజన చట్టంలో, బిల్లులో లేని.. స్పీకింగ్ ఆర్డర్ జైపాల్ రెడ్డి విద్యుత్‌కు సంబంధించిన ఇప్పించడం జరిగిందన్నారు. జైపాల్ రెడ్డి కృషితో 53.64 శాతం తెలంగాణకు విద్యుత్ వాటా ఇప్పించారన్నారు. "ఇక్కడ ఉన్న పికుడుగాడు ఇవ్వడు అది చేయలేదు" అని విమర్శించారు. కేసీఆర్ ఎలా సభను తప్పుదోవ పట్టిస్తున్నారు అని...తాను తెలుగు దేశంలో ఉన్నప్పుడు వాస్తవాలను వివరించడం జరిగిందన్నారు. మార్షల్‌తో తనను బయట పడేయించారని ఆనాటి విషయాలను గుర్తుచేశారు. తెలంగాణను విద్యుత్ సంక్షోభం నుంచి జైపాల్ రెడ్డి, సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ బయట పడేశారన్నారు. ఏడు వేల యూనిట్ల ఉత్పత్తి నుంచి 19 వేల ఉత్పత్తి చేశామని సిగ్గు లేకుండా చెబుతున్నారన్నారు. ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేస్తే.. ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా ఏర్పాటు జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రభుత్వం ఒప్పందాలు జరిగితే కమిషన్‌లు ఎలా వస్తాయి అంటున్నారన్నారు. ఎక్కడ నొక్కారు.. ఎక్కడ పొక్కారు అనేది తెలుసన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుందన్నారు. తెలివితో డైరెక్ట్‌గా బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టు ఇచ్చారన్నారు. విచారణకు ఇస్తే.. ఎందుకు గుండెలు గుద్దుకుంటున్నారు.. బాధపడుతున్నారని ప్రశ్నించారు. సివిల్ కాంట్రాక్టులు అన్ని వీళ్ళ బినామీలకు ఇచ్చారని విమర్శించారు. కంకర నుంచి సెక్యూరిటీ గార్డుల వరకు.. వీళ్ళ సంబంధీకులకు కట్టబెట్టారని ఆరోపించారు. 2400 మెగా వట్ల విద్యుత్‌కు టెండర్లు పిలుస్తే.. బీహెచ్ఈఎల్ ఇతర కంపెనీలు పాల్గొన్నాయన్నారు. అదే తేదీ జార?ండ్‌లో 18 శాతం తక్కువకు 2400 వందల మెగా వాట్ల ఉత్పత్తికి ఒప్పందం కుదుర్చుకుందన్నారు. రాష్ట్రాన్ని ఎలా దోచుకోవచ్చు.. అనేది వాళ్ళు, వాళ్ళ గురువు చేసి చూపెట్టారన్నారు. సబ్ క్రిటికల్‌లో విద్యుత్ తక్కువ.. బూడిద ఎక్కువ వస్తుందన్నారు. సూపర్ క్రిటికల్‌లో విద్యుత్ ఎక్కువ.. బూడిద తక్కువ వస్తుంది అని మన్మోహన్ సింగ్ పక్కాగా చెప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో పేర్కొన్నారు.

## అప్పులు చేయకుండా నోట్లు ముద్రించాలా?: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్: రైతుల పొలాల్లో మీటర్లు పెట్టడానికి కేసీఆర్ ఒప్పుకోలేదని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చే రూ.30 వేల కోట్లను కూడా వదులుకున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్లపై సీఎం ప్రజలను పక్కదారి పట్టిస్తున్నార న్నారు. మోదీ, కేసీఆర్, ఉదయ్ స్కీమ్ గురించే మాట్లాడుకున్నారని చెప్పారు.

"2014కి ముందు మాత్రమే కరెంటు లైన్ల కింద ఇళ్ల నిర్మాణం జరిగింది. భారాస ప్రభుత్వంలో కరెంటు లైన్ల కింద ఇళ్ల నిర్మాణం జరగలేదు. పదేళ్ల భారాస పాలనలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం పెరిగింది. 2014లో రాష్ట్రంలో వ్యక్తిగత విద్యుత్ వినియోగం 1,196 కిలో వాట్లు. 2024లోఇది 2,349 కిలో వాట్లకు చేరింది. మా ప్రభుత్వంలోనే విద్యుత్ వినియోగం పెరిగింది.

రూ.90 వేల కోట్లు పెట్టి విద్యుత్ సరఫరాను బలోపేతం చేశాం. వినియోగం ఆధారంగానే విభజన సమయంలో రాష్ట్రానికి విద్యుత్‌ను కేటాయించారు. రూ.24 వేల కోట్ల అప్పుతో విద్యుత్ రంగం మా చేతికి వచ్చింది. అప్పులు చేయకుండా అభివృద్ధి ఎలా చేయాలి? అప్పులు చేయకుండా నోట్లు ముద్రించాలా? అప్పులు చేస్తున్నామని అసెంబ్లీలో కేసీఆర్ ఆనాడే చెప్పారు.

ఏదో కొత్త విషయం చెప్పినట్లు ఇప్పుడు పదేపదే అప్పులు చేశారు అంటున్నారు" అని జగదీశ్‌రెడ్డి తెలిపారు.

## పరవళ్లు తొక్కుతున్న బొగత జలపాతం.. పర్యాటకుల సందడి



హైదరాబాద్ : తెలంగాణ 'నయాగార'గా గుర్తింపు పొందిన అందాల బొగత జలపాతం జలకళను సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న వానలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో ఉన్న బొగత జలపాతానికి వరద పోటెత్తింది. జలపాతానికి భారీగా నీరు వస్తుండటంతో జలసవ్వడులను చూడటానికి పర్యాటకులు క్యూకడుతున్నారు. ప్రకృతి సోయగాలను తిలకించి మైమరచిపోతున్నారు. కాగా, వరద ఉధృతితో ఇటీవల బీటెక్ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందడంతో సందర్శనను నిలిపివేసిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల అనంతరం బొగత జలపాతం సందర్శన నిన్న తిరిగి ప్రారంభమైంది. దీంతో పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చి సందడి చేశారు.

## రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపిన తండా వాసులు

సూర్యాపేట : కాంగ్రెస్ పాలనలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. చినుకు పడితే చాలు రోడ్లు జలమయమవుతున్నాయి. ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రావులపల్లి ఆవాస గ్రామం చోవులతండాలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ తండాకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం గిరిజన బిడ్డలు ఆగ్రహం చెందారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ సోమవారం రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డు బురదతో చిత్తడిగా మారుతుందన్నారు. దీంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి వెళ్లాలంటే వాహనాలు సైతం బురదలో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా



స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు స్పందించి గిరిజన తండాకు సీసీ రోడ్డు సౌకర్యము కల్పించాలని తండావాసులు కోరుతున్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్: తెలంగాణ నూతన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం 9గంటల సమయంలో రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను శాలువాతో సన్మానించారు.

అనంతరం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఇటీవల తెలంగాణ గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ నియమించిన సంగతి తెలిసిందే. నూతన గవర్నర్ వచ్చిన సందర్భంగా రేవంత్ రెడ్డి ఆయణ్ను కలిశారు. రాష్ట్ర ప్రజల తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసెంబ్లీ సమావేశాలకు సీఎం వెళ్లారు. ఈనెల 31న రాజ్ భవన్‌లో జిష్ణుదేవ్ వర్మను గవర్నర్‌గా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. గతంలో జిష్ణుదేవ్ వర్మ త్రిపుర ఉపముఖ్యమంత్రిగా పని చేశారు. ఈయన త్రిపుర రాజకుటుంబానికి చెందిన వ్యక్తి కాగా..1990లో రామజన్మభూమి ఉద్యమానికి ఆకర్షితులపై బీజేపీలో చేరారు. తెలంగాణ ఇన్‌ఛార్జ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ కావడంతో ఆయన ఇవాళ రిలీవ్ కానున్నారు. శాసనసభ సమావేశాల అనంతరం రాధాకృష్ణన్‌కు వీడ్కోలు పలికేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు రాజ్ భవన్‌కు వెళ్లనున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర పండగ బోనాల సందర్భంగా రాధాకృష్ణన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం మొత్తం పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని మహంకాళి, ఎల్లమ్మతల్లిని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## సివిల్స్ విద్యార్థుల మృతి.. ప్రమాదానికి ముందు దృశ్యాలు వైరల్

ఢిల్లీ: సెంట్రల్ ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే ప్రమాదానికి ముందు తీసిన ఓ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారుతోంది. వీడియోలో వరద నీరు బేస్‌మెంట్‌లోకి ప్రవేశించడంతో లోపల ఉన్న విద్యార్థులు నీటిలో నుంచి మెట్ల మీదుగా బయటకు వస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. లోపల ఉన్న విద్యార్థులు త్వరగా బయటకు రావాలంటూ ఓ వ్యక్తి చెప్తూ ఇంకెవరయినా లోపల ఉన్నారా అని ఆరా తీస్తున్నట్లుగా వీడియోలో వినిపిస్తుంది. అయితే మృతి చెందిన విద్యార్థులు బయటకు వచ్చేలోపే వరద చుట్టిముట్టి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఇలా చట్ట విరుద్ధంగా కోచింగ్ సెంటర్లు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న స్టడీ సెంటర్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఢిల్లీలో అక్రమంగా నడిపిస్తున్న కోచింగ్ సెంటర్లపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. అక్రమంగా నడిపిస్తున్న 13 కోచింగ్ సెంటర్లకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీల్ వేశారు. నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్లు నిర్వహించడం వల్లే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. శనివారం సాయంత్రం రావూస్ స్టడీ సర్కిల్ లోని బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు ప్రవహించడంతో ముగ్గురు విద్యార్థులు తానియా సోని, శ్రేయా యాదవ్, నవిన్ డెల్విన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టడంతో కోచింగ్ సెంటర్ యజమాని అభిషేక్ గుప్తా, కోఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌లను అరెస్టు చేసి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ప్రమాదం జరిగిన మూడంతస్తుల భవనం సెల్లార్‌ను స్టోర్ రూమ్, పార్కింగుకు కేటాయిస్తామని ప్రణాళికలో చూపించి గ్రంథాలయంగా ఉపయోగిస్తున్నట్లు తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో 18 మందికి పైగా విద్యార్థులు అందులో ఉన్నట్లు తెలిపారు. సెల్లార్‌లో మురుగునీరు బయటకు వెళ్లే వ్యవస్థ కూడా లేదన్నారు.

## చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నా చేయాలి : తమ్మినేని



బెల్లంపల్లి పట్టణం: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తాలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను ప్రారంభించారు. ప్రైవేటీకరణకు మద్దతు ప్రకటించడంలో కాంగ్రెస్, భాజపా, భారాస ఒకటేనని విమర్శించారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకం కానప్పుడు శాసనసభలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు తీర్మానం చేయలేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ దేశానికి చాలా నష్టమని చెప్పారు. 900 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు వున్నాయని, కేవలం 175కోట్ల టన్నుల బొగ్గును వెలికి తీశారని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒకే వేదికపై కూర్చొని వేలం లేదంటూనే ఆ ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని చెప్పారు. ప్రజలంతా ముందుకు వచ్చి సింగరేణిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, చుక్క రాములు, భూపాల్, జిల్లా కార్యదర్శి సంకే రవి పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రూ.7 కోట్ల నిధులతో మంజూరైన సీడు ప్రాసెసింగ్ ప్లాంట్ పనులు 70 శాతం పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. మంత్రికి తెలిపారు. అందుకు సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కి కార్పొరేషన్ గ్రాంటు రూ.3.50 కోట్లు, ఎస్‌డీఎఫ్ గ్రాంట్ నుంచి కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా కార్పొరేషన్ గ్రాంట్ నుంచి రూ.1.24 కోట్లు ఎస్‌డీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.3.50 కోట్లు నిధులను వెంటనే విడుదల చేయాలని, తద్వారా షెడ్డు,యంత్రాల ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి అవుతాయని మంత్రికి వివరించారు. తద్వారా ఎంతోమంది రైతులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని మంత్రికి వినతి పత్రం అందజేశారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com